సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 25-7-2025 15/-

# కాలం మారుతోంది






గీటురాయి
వారపత్రిక
**GEETURAI WEEKLY**
Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in
**Our Bank A/c Details:**
Geeturai Weekly, A/c No.1042789768
IFSC : CBIN0282407, Central Bank of India
Noor Khan Bazar Branch, Hyderabad

సంపుటి: 47 సంచిక: 29 హైదరాబాద్
శుక్రవారం 25 జులై 2025 రూ.15-00
29 ముహర్రమ్ 1447 హిజ్రీ

**తొలిగీటు**

అల్లాహ్‌కు అత్యంత ప్రీతికరమైన సుగుణాలు మీలో రెండున్నాయి. ఒకటి సహనం, రెండవది తొందరపాటు లేకపోవటం.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)

**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**


Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. e-mail: geeturaiweekly@gmail.com




## లోపల...

| | | |
|---|---|---|
| భాష | ...... | 04 |
| కాలం మారుతోంది | ...... | 05 |
| మహనీయ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) – 2 | ...... | 09 |
| ఆంహ్! అబ్దుర్రజ్జాఖ్ సాబ్! | ...... | 12 |
| విభిన్నంగా ఆలోచించండి | ...... | 13 |
| చరితార్థులు-2 : డాక్టర్ షౌకతుల్లాహ్ షాహ్ అన్సారి | ...... | 16 |
| నా కొడుకు ఎక్కడ ఉన్నాడు? | ...... | 17 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు (సహీహ్ బుఖారీ అనువాదం) | ...... | 19 |
| శుభస్య శీఘ్రం | ...... | 20 |
| జాతీయ విద్యా విధానం-మైనారిటీల హక్కులు | ...... | 24 |
| మన చదువులు, విలువలు ఏమైపోతున్నాయి? | ...... | 26 |
| ఊబకాయాన్ని తగ్గించుకునేదెలా? | ...... | 28 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| నేర నిరోధానికి నైతిక, ఆధ్యాత్మిక శిక్షణ | ...... | 34 |

**హరిత సంకల్పం ...**




మట్టిలోపల చేతులు
మనసులోన దేశము
కదిల్నారోయ్ పిల్లలు
ధరణి రక్షణ కోసము!
చుక్కచుక్క ఒడిసిపట్టి
మొక్కమొక్క నాటినారు
పల్లె పట్నం పచ్చదనమే
ఎవరు వీరికి సాటిరారు!!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

# ఆలోచన

## భాష

హైదరాబాదులో ఉండేవారికి హిందీ ప్రత్యేకంగా నేర్చుకోవలసిన అవసరం లేదు. ఇక్కడ తెలుగుతో పాటు, దక్కనీ ఉర్దూ మాట్లాడతారు. హిందీకి దక్కనీ ఉర్దూకు పెద్దగా తేడా లేదు. హిందీ నేర్చుకోవాలా వద్దా అనే ప్రశ్నే ఇక్కడి వారికి ఉండదు. కాని, వాస్తవమేమిటంటే, అసలు హిందీ అవసరమే రాదు. హైదరాబాద్ దాటి తెలంగాణలో ఎక్కడికి వెళ్ళినా సంభాషణలు తెలుగులోనే జరుగుతాయి. ఉద్యోగాలు, వృత్తి నైపుణ్యాల కోసం ఇంగ్లీషు ఎలాగూ తప్పదు. మరి హిందీ ఎందుకు నేర్చుకోవాలి?

ఉత్తరాది రాష్ట్రాల నుంచి వలస కార్మికులు హైదరాబాద్ నగరానికి వస్తుంటారు. ఇక్కడికి వచ్చిన ఈ వలస కార్మికులకు హైదరాబాద్‌లో మాట్లాడే దక్కనీ కొంత భాషా సౌలభ్యాన్నిస్తుంది.

ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ హిందీ నేర్చుకోవాలని ప్రోత్సహిస్తున్నారు. దక్షిణాదిన తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలు బలవంతంగా హిందీని రుద్దితే ఒప్పుకునేది లేదంటున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలోని పెద్దలు హిందీకి సానుకూలంగా చేస్తున్న వ్యాఖ్యలు ఆసక్తికరమైనవి.

కేంద్రం నుంచి వచ్చే నిధుల కోసం తెలుగుదేశం, జనసేన పార్టీలు కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా మాట్లాడడం అవసరం కాబట్టి బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని మనం సర్ది చెప్పుకోవాలి. దక్షిణాది రాష్ట్రాలకు వారి స్వంత సంస్కృతి, భాష, సాహిత్య చరిత్ర ఉన్నాయి. ఇవేవీ హిందీ కన్నా తక్కువ కాదన్నది గుర్తుంచుకోవలసిన విషయం.

గతంలో ఎన్టీ రామారావు తెలుగువారి ఆత్మగౌరవం కోసమే పార్టీ పెట్టి గెలిచారన్నది కూడా మనం మరచిపోరాదు. ఇప్పుడు ఆ పార్టీకి చెందిన వారే, ఆయన కుటుంబ సభ్యులే హిందీకి వంతపాడడం కాలం తెచ్చిన మార్పు.

ఎప్పుడూ దక్షిణాది వారిని హిందీ నేర్చుకోమని బయటి వారు నీతులు చెప్పడం మామూలే. ఎందుకు నేర్చుకోవాలి. ఉత్తరాది వారితో మాట్లాడే సౌలభ్యం కోసం. కాని ఉత్తరాది వారు దక్షిణాది భాషలేమైనా నేర్చుకుంటున్నారా? హైదరాబాద్, బెంగళూరు వంటి దక్షిణాది నగరాలకు లక్షలాది వలస కార్మికులు ఉత్తరాది నుంచే వస్తుంటారు, వీరితో పాటు అనేకమంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూడా వస్తుంటారు, మరి వీళ్ళందరికి ఇక్కడి స్థానిక భాషలో మాట్లాడవలసిన అవసరం లేదా? వీళ్ళెవ్వరూ ఎందుకు స్థానిక భాషలు నేర్చుకోరు?

దక్షిణాది వారు హిందీ నేర్చుకోవడం వల్ల ఈ వలస కార్మికులతో మాట్లాడడం తేలికవుతుంది కాబట్టి హిందీ నేర్చుకోవాలా? ఆఫీసులో ఉత్తరాది నుంచి వచ్చిన తోటి ఉద్యోగులతో మాట్లాడే సౌలభ్యం కోసం నేర్చుకోవాలా?

నిజానికి తెలుగు భాషకు ప్రస్తుతం అనేక సమస్యలున్నాయి. తెలుగులో పాఠకులు తగ్గిపోతున్నారు. ఇంగ్లీషు ప్రాబల్యం మరింత పెరుగుతోంది. ఈ నేపథ్యంలో తెలుగు నేర్చుకోడానికే పెద్దగా ఆసక్తి చూపించని పరిస్థితి ఉంటే, హిందీ కూడా నేర్చుకోమని చెప్పడం వల్ల తెలుగు పూర్తిగా అటకెక్కుతుంది.

భాషలన్నీ సమానమే. ప్రతి భాషని గౌరవించాలి. నేర్చుకునే అవకాశం ఉన్న ప్రతి భాషను నేర్చుకోవాలి. కాని కేవలం ఉత్తరాది సౌలభ్యాల కోసం దక్షిణాది వారిపై హిందీని రుద్దడం సముచితం కాదు. హిందీ నేర్చుకోవడం వల్ల దక్షిణాది వారికి లభించే ప్రయోజనాలేమిటి? కొత్త ఉద్యోగావకాశాలున్నాయా? ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయా? అలాంటిదేమీ లేదే!?

హిందీ పట్ల తీవ్రమైన వ్యతిరేకత కూడా అవసరం లేదు. హిందీని భాషాపరంగా గౌరవిస్తూనే తెలుగు భాషాసంస్కృతుల పరిరక్షణకు ప్రయత్నించాలి.

**కవరు కథనం** **అబ్దుల్ వాహెద్**

# కాలం మారుతోంది



**నరేంద్ర మోడీకి 75 ఏళ్లు పూర్తయ్యాయి** కాబట్టి ప్రధాన మంత్రి పదవి నుంచి దిగిపోవాలనే చర్చ ఒకటి వినిపిస్తోంది. ఈ చర్చ వెనుక రాజకీయాలు ఎక్కువ, నిజాయితీ తక్కువ. ఎల్.కె. అద్వానీ, మురళీ మనోహర్ జోషి, యశ్వంత్ సిన్హా వంటి సీనియర్లను పెద్దవయసు సాకుతో రాజకీయాల నుంచి పక్కకు నెట్టివేసినప్పటికీ, వారిని పక్కన పెట్టడానికి అసలు కారకులు మోడీ-అమిత్‌షాలే అన్నది అందరికీ తెలిసిన వాస్తవం.

మోడీ ప్రజాదరణ, పార్టీపై నియంత్రణ రెండూ తగ్గుముఖం పట్టాయన్నది నిర్వివాదాంశం. 2024 పార్లమెంటరీ ఎన్నికలలో బీజేపీకి మెజారిటీ దక్కలేదు. మోడీ ప్రజాదరణ పడిపోయింద నడానికి ఇదే అతిపెద్ద రుజువు. పార్టీ అధ్యక్షుడిగా తనకిష్టమైన నేతను నియమించలేకపోవడం పార్టీపై నియంత్రణ తగ్గిందన డానికి నిదర్శనం.

2014 తర్వాత 75 ఏళ్ళకు రిటైర్మెంట్ అని చెప్పింది స్వయంగా మోడీయే. ఇప్పుడాయనపై ఒత్తిడి తీసుకురావడానికి ఇదే వాదన ముందుకు తెస్తున్నారు. 11 సంవత్సరాల మోడీ పాలనలో పూర్తి కాని హామీలు, అబద్ధాలు, ఒకేతీరు ప్రసంగాలు, హిందూ ముస్లిం రాద్ధాంతాలు... ఆయన ఏం మాట్లాడతారో ఆయన మాట్లాడక ముందే ప్రజలు చెప్పేసే పరిస్థితి వచ్చింది. ఉద్యోగాల కల్పన, అధిక ధరల అదుపు, నల్లధనంపై వాగ్దానం, మహిళా రక్షణ ఇలా అనేక రంగాల్లో వైఫల్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 2047 నాటికి "వికసిత్ భారత్" ను అందిస్తానని మోడీ చేసిన వాగ్దానాన్ని ప్రజలు నమ్మే స్థితి లేదు. నిఘా సంస్థల దుర్విని యోగం, రాజకీయ కక్ష సాధింపు ఆరోపణలు, గోదీ మీడియా అంటూ ప్రజల్లో మీడియా పట్ల ఏహ్యాభావం ఇవన్నీ ప్రజా స్వామ్యం క్షీణిస్తుందనడానికి సంకేతాలు. మోడీ ఢంకా విదేశాల్లో మోగుతుందన్న ప్రచారం బెలూన్‌కు సూది గుచ్చినవాడు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. భారతీయులను బంధించి, అవమానకరంగా సైనిక విమానాలలో వెనక్కి పంపాడు. యుద్ధ విరమణ నేనే చేయించానంటూ ట్రంప్ చేసిన ప్రకటన మరో దెబ్బ. గాజాలో ఇస్రాయీల్ హత్యాకాండను అమెరికా ఒత్తిడి వల్లనో, మరో కారణంతోనో ఖండించలేకపోవడం కూడా అంతర్జాతీయ ప్రతిష్ఠను దిగజార్చింది. అమెరికాతో సహా ప్రపంచ వ్యాప్తంగా గాజాలో జరుగుతున్న మారణకాండకు వ్యతిరేకంగా భారీ నిరసనలు జరుగుతుంటే, ఇక్కడ గాజాకు మద్దతుగా మాట్లాడడాన్ని కూడా అడ్డుకోవడం జరుగుతోంది.

పహల్గామ్ ఉగ్రదాడి విషయంలో, పాకిస్తాన్‌తో యుద్ధం విష యంలో మనకు మద్దతుగా నిలిచిన దేశాలేవీ లేకపోవడం మన విదేశాంగ విధానంలోని వైఫల్యం.

ముంబై ఉగ్రదాడి జరిగినప్పుడు మన్మోహన్ సింగ్ ప్రభుత్వం దౌత్య ప్రయత్నాలతో పాకిస్తాన్‌ను ఒంటరి చేసింది. కాని ఇప్పుడు మోడీ హయాంలో దేశం ఒంటరిగా మారింది. అమెరికాలో అదానీ గ్రూప్ ఎదుర్కొంటున్న చట్టపరమైన సమస్యలు మోడీకి ప్రతిబంధకాలుగా మారాయని కొందరంటున్నారు.

ఈ నేపథ్యంలో మోడీని గద్దె దించాలని సంఘ్ పరివార్ భావి స్తుంటే దానికి కారణం వయసు కాదు, వైఫల్యాలు. మోడీ వల్ల ఓట్ల వాన కురుస్తుందనే నమ్మకం ఉంటే ఈ చర్చ వచ్చేదే కాదు.

ఒకవైపు బీజేపీలో అగ్రనేత మోడీ రాజకీయ ప్రభ క్షీణిస్తుంటే మరోవైపు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రభ ప్రకాశిస్తోంది.

సంయమనం, కష్టపడే తత్వం ఉంటే విజయం తథ్యం. ఇదే వ్యక్తిత్వ వికాస పాఠంగా చెబుతున్నది కాదు, ఇప్పుడు రాజకీయాల్లో కనిపిస్తున్న వాస్తవం కూడాను. ఎందుకంటే రాజకీయాల్లో అధికారంలో లేనప్పుడు ఎదురయ్యే ఇబ్బందులను అధిగమిస్తూ, సంయమనం కోల్పోకుండా, పట్టు వదలకుండా చేసే ప్రయత్నాలే విజయానికి సోపానాలని రాహుల్ గాంధీ నిరూపించాడని చెప్పవచ్చు.

కాలం ఎల్లప్పుడు ఒకే తీరున ఉండదు. బళ్ళు ఓడలు కావచ్చు, ఓడలు బళ్ళు కావచ్చు. కేవలం సంవత్సర కాలంలో పరిస్థితులు చాలా మారిపోయాయి. తిరుగులేని నేతగా నిన్నటి వరకు పేరుపడిన ప్రధాని మోడీ గుప్పిట నుంచి ఇసుక జారినట్లు కాలం జారిపోయింది. మరోవైపు రాహుల్ గాంధీకి జనాదరణ పెరుగుతోంది.

రాహుల్ గాంధీ ఇప్పుడు భారత రాజకీయాల్లో తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు. బీజేపీ వ్యూహాత్మకంగా రాహుల్ గాంధీని కించపరచడానికి ప్రయత్నించింది, పప్పు అని ఐటి సెల్‌తో ప్రచారం చేయించింది. ఇప్పుడు రాహుల్‌ను ఎవరైనా పప్పు అంటే అలా అన్న వారే నవ్వుల పాలవుతున్నారు. బిజెపి ఎగతాళి ఫార్ములా ఇప్పుడు బెడిసికొట్టింది. కాగా మరోవైపు దశాబ్దకాలంగా రాజకీయాల్లో ఎదురులేని నేతగా కొనసాగిన మహానేత ఇప్పుడు కొంచెమైపోతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఆయనపై పార్టీలో ఒత్తిడి, అంతర్జాతీయ వ్యవహారాల్లో వైఫల్యాలు, అనేక ఒత్తిళ్ల మధ్య ప్రధాని మోడీ విశ్వసనీయత ఇప్పుడు ప్రశ్నార్థకమైపోయింది.

మడమ తిప్పని పోరాటం, స్థిరచిత్తం, కష్టపడే స్వభావం- ఇవే రాహుల్ గాంధీని గట్టెక్కించాయని చెప్పాలి. ఒకప్పుడు మోడీ వెనుక నిలబడి, మోడీ మోడీ అని నినాదాలు చేసిన వారు ఇప్పుడు నెమ్మదిగా రాహుల్ గాంధీ వైపు మరలుతున్న దృశ్యం కనిపిస్తోంది. ఇలా చెప్పడానికి కొన్ని ఉదాహరణలు చూద్దాం- లక్నో కోర్టులో ఏం జరిగింది?

లక్నోలోని ఎంపీ ఎమ్మెల్యే కోర్టులో రాహుల్ గాంధీ హాజరయ్యారు. అది పరువు నష్టానికి సంబంధించిన కేసు. గల్వాన్ లోయకు సంబంధించి ఆయన ఒక ప్రకటన చేశారు. ఈ కేసులో ఆయనకు బెయిల్ లభించింది. ఇక్కడ చర్చనీయాంశం ఆ కేసు ఏమిటన్నది కాదు, బెయిల్ ఎలా వచ్చిందన్నది కూడా కాదు. రాహుల్ గాంధీ లక్నో కోర్టులో హాజరైన దృశ్యంపై వస్తున్న వ్యాఖ్యలు గమనించదగ్గవి. రాహుల్ గాంధీ న్యాయస్థానంలో బెంచ్ ముందు, న్యాయమూర్తుల ఎదుట నిలబడిన దృశ్యాన్ని చాలా మంది మహాత్మా గాంధీ బ్రిటిష్ కోర్టులో న్యాయమూర్తి ముందు నిలబడడంతో పోల్చుతూ వ్యాఖ్యానించారు. అంతేకాదు, కోర్టులో రాహుల్ గాంధీతో ఫోటో దిగడానికి న్యాయవాదులు పోటీపడ్డారు. తొక్కిసలాట లాంటి వాతావరణం ఏర్పడిందని కూడా తెలుస్తోంది.

కొంతకాలం క్రితం పరిస్థితి ఎలా ఉండేది? రాహుల్ గాంధీని ఎవ్వరూ పట్టించుకునేవారు కాదు, ఈ న్యాయవాదులలోనే చాలా మంది బహుశా ఒక సంవత్సరం క్రితం రాహుల్ గాంధీని పప్పు అంటూ ఎగతాళి చేసినవారు కూడా ఉండవచ్చు. అభిప్రాయాలు మారుతున్నాయి. పరిస్థితులు మారుతున్నాయి. రాహుల్ గాంధీ వరకు అచ్చేదిన్ వచ్చినట్లే కనిపిస్తోంది. రాహుల్ గాంధీ కోర్టులోకి వస్తున్నప్పుడు లేదా కోర్టు నుండి బయటకి వెళ్తున్నప్పుడు, మొత్తం కోర్టు ప్రాంగణం నినాదాలతో ప్రతిధ్వనించింది. యువ కాంగ్రెస్ నాయకులు లేదా కాంగ్రెస్ కార్యకర్తలు ఈ నినాదాలు ఇచ్చిన వారిలో ఉండవచ్చు. కానీ లక్నో వంటి నగరంలో ఆయన్ను చూడటానికి గుమిగూడిన జన సమూహం ఏం చెబుతోంది? ఇక్కడ కాంగ్రెస్ చివరిసారిగా ఎప్పుడు గెలిచిందో కూడా ఎవరికీ గుర్తు లేదు. ఇది బిజెపికి కంచుకోట. అలాంటి చోట రాహుల్ గాంధీని చూడటానికి జనం భారీ సంఖ్యలో రావడాన్ని ఎలా చూడాలి? 2024 ఎన్నికలకు ముందు లక్నోలో మోడీ మోడీ నినాదాలు వినిపించాయి. ఈ రోజు ఆ లక్నోలో రాహుల్ గాంధీ నినాదాలు వినిపించాయి. కాలం మారుతుందనడానికి ఇది ఉదాహరణ కాదా? మరో ఉదాహరణ చూద్దాం.

## భారతీయ అమెరికన్ల వైఖరి

ప్రధానమంత్రి విదేశీ పర్యటనకు వెళ్ళినప్పుడల్లా మనకు సాధారణంగా కనిపించే ఒక దృశ్యం ఉంది. విమానాశ్రయం వద్ద, మోడీ వెళ్ళిన ప్రతి చోటా భారతీయులు భారత జెండా పట్టుకొని మోడీ మోడీ అని నినాదాలు చేస్తున్న వీడియోలు అనేకం వస్తుంటాయి. మోడీని ప్రేమించే చాలా మంది ఇంటర్వ్యూలు కూడా మీడియాలో కనిపిస్తుంటాయి. ఇది గత పదేళ్ళుగా మనం చూస్తూ వస్తున్నాం. ప్రధానమంత్రి గత 10 సంవత్సరాలలో తొమ్మిదిసార్లు అమెరికాకు వెళ్ళారు. అమెరికాలో "హౌడీ మోడీ" ఇంకా ఇలాంటి చాలా చాలా కార్యక్రమాలు జరిగాయి. కాబట్టి అమెరికాలో నివసిస్తున్న భారతీయులందరూ మోడీ అభిమానులని, మోడీకి బలమైన మద్దతుగా నిలబడతారనే అభిప్రాయం ఉంది.

కాని ఇప్పుడు పరిస్థితేమిటి? అమెరికాలో నివసిస్తున్న భారతీయులు బిజెపికి ఒక పెద్ద బలం. ఎందుకంటే అక్కడి నుండి చాలా విరాళాలు లభిస్తాయి. మోడీ విశ్వగురు అనే ప్రచారంలో భారతీయ అమెరికన్లే పెద్ద పాత్ర పోషించారు. కానీ ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. ఇండియన్ అమెరికన్ యాటి ట్యూడ్ అనే ఒక సంస్థ ఉంది. ఇటీవల వారి సర్వే వచ్చింది. ఇండియన్ అమెరికన్ యాటిట్యూడ్ సర్వే ప్రకారం 2024. విదేశాలలో,

ముఖ్యంగా అమెరికాలో విమానాశ్రయం వద్ద, రోడ్లపై మోడీ మోడీ అని నినాదాలు చేసిన భారతీయులు ఇప్పుడు నెమ్మదిగా రాహుల్ గాంధీ వైపు మరలుతున్నారని తెలుస్తోంది.

ఈ సర్వే నివేదిక ప్రకారం 2020, 2024 సంవత్సరాల్లో ప్రధానిగా మోడీకి లభిస్తున్న ఆదరణను పరిశీలిస్తే 2020లో 35% మంది భారతీయ అమెరికన్లు మోడీ పని తీరును బలంగా ఆమోదించారు. 2024లో 36% మంది అంటే మోడీ పనితీరు విషయంలో కేవలం ఒక్క శాతం పత్రమే పెరుగుదల నమో దయ్యింది. ఇది బలంగా మోడీ పనితీరును ఆమోదించే వారి విషయం. బలంగా కాకపోయినా ఆమోదిస్తున్న వారి గణాంకాలు చూస్తే, 2020లో మోడీ పనితీరును 15 శాతం భారతీయ అమెరికన్లు ఆమోదించేవారు, కాని 2024లో ఇది 11%కి పడిపోయింది. మోడీ పనితీరు పట్ల అసమ్మతి ప్రకటించేవారి విషయానికి వస్తే 2020లో భారతీయ అమెరికన్లలో 9 శాతం మంది మోడీ పనితీరు పట్ల అసమ్మతి కలిగి ఉంటే ఇప్పుడు 2024లో 11 శాతం అయ్యారు. బలంగా వ్యతిరేకిస్తున్న వారి గణాంకాలు చూస్తే 2020లో 22 శాతం మంది బలంగా మోడీని వ్యతిరేకించేవారు, 2024 వచ్చేసరికి 23%కి పెరిగారు.

ఈ సర్వేలో అడిగిన మరో ప్రశ్న కూడా ముఖ్యమైనది. భారత దేశంలో మైనారిటీలకు, మైనారిటీల మతాలకు ముప్పు ఉందా అనే ప్రశ్నకు  వివిధ మతాలకు చెందిన భారతీయ అమెరికన్ల నుంచి జవాబులు గమనిస్తే, భారతీయ క్రైస్తవులలో 41% మంది భారతదేశంలో మైనారిటీలకు చాలా పెద్ద ముప్పు ఉందని నమ్ము తున్నారు. భారతదేశంలో మైనారిటీలకు పెరుగుతున్న ముప్పును మోడీ భాష మరింత పెంచుతుందా? అనే ప్రశ్నకు  క్రైస్తవులలో 41% మంది అవును, ఇది  పూర్తిగా  నిజం అని అన్నారు. గమనించవలసిన విషయమేమిటంటే హిందువులలో కూడా 31% మంది అవును, మైనారిటీలకు ముప్పు ఉందని అన్నారు. హిందువుల్లో 35% మంది చాలా ఎక్కువ ముప్పు ఉందని అన్నారు. అంటే 31 మరియు 35 కలిపితే, 66% హిందువులు కూడా భారతదేశంలో మైనారిటీలకు మోడీ భాష ముప్పుగా మారిందని నమ్ముతున్నారు. ముస్లింల విషయానికి వస్తే, ముస్లింలలో 47 శాతం భారతదేశంలో మైనారిటీలకు ముప్పు ఉందని అంగీకరించారు.

ఈ సర్వేలో అడిగిన మరో ప్రశ్న భారతదేశంలోని ఏ పార్టీ అంటే మీకు ఇష్టమనే ప్రశ్నకు 51% మంది ప్రజలు భారత రాజకీయాల్లో ఏ రాజకీయ పార్టీ పట్ల కూడా ప్రత్యేకమైన ఇష్టం ఏమీ లేదని అన్నారు. 28% మంది బిజెపి అంటే ఇష్ట మన్నారు. కాంగ్రెస్‌ను ఇష్టపడేవారు  20% మంది ఉన్నారు. కేవలం 8% తేడా మాత్రమే మిగిలి ఉంది. ఒకప్పుడు బిజెపి సుమారు 36% వద్ద ఉంటే, కాంగ్రెస్ 10–11% వద్ద ఉండేది. ఇది 2024 వరకు సర్వే. తాజా పరిస్థితి ఇందులో లేదు. ఈ సర్వేలో అవును/ కాదు ప్రశ్నలకు ఇచ్చిన సమాధానాలు కూడా గమనించవలసినవి. 2020లో నరేంద్రమోడీ విషయంలో అవును అని సమాధానమిచ్చినవారు 55 శాతం, 2024లో నరేంద్రమోడీ విషయంలో అవును అని సమాధానమిచ్చినవారు 52 శాతం. బిజెపి విషయంలో అవును అని చెప్పిన వారు 2020లో 55% ఉండగా, 2024లో 49%కి తగ్గింది.

కాంగ్రెస్ పార్టీ విషయంలో అవును సమాధానం 2020లో 46%, 2024లో 48%కి పెరిగింది. రాహుల్ గాంధీ విష యంలో అవును అని సమాధానమిచ్చినవారు 2020 లో 43%, 2024లో 48% అంటే  5% పెరుగుదల. రాహుల్ గాంధీ ప్రజాదరణ అమెరికన్ భారతీయులలో 5% పెరిగింది,  మోడీ ప్రజాదరణ 3% తగ్గింది. ఇది 2024 చివరి డేటా. 2025లో పరిస్థితి ఇంకా మారి ఉండవచ్చు. ముఖ్యంగా పహల్గాం ఉగ్రదాడి, ఆ తర్వాత పాకిస్తాన్‌తో ఆకస్మిక యుద్ధ విరమణ, యుద్ధ విరమణ నేనే చేయించానని చెప్పుకునే ట్రంప్, ఆయనకు జవాబు చెప్పలేకపోవడం వగైరా పరిణామాల తర్వాత మోడీ ప్రజాదరణ మరింత తగ్గి ఉండవచ్చు. ఆరెస్సెస్ విషయానికి వస్తే 2020లో 48%  మంది భారతీయ అమెరికన్లు ఆర్‌ఎస్‌ఎస్‌కు సానుకూలంగా ఉంటే, 2024లో 42% మాత్రమే ఉన్నారు.


రాహుల్ గాంధీ  స్థిరంగా,  సంయమనం పాటిస్తూ, బీజేపీ ప్రభుత్వంపై నిరంతర దాడి  కొనసాగిస్తూ, తాను ప్రస్తావించే సమస్యలను వదిలిపెట్టకుండా పోరాడుతూనే వచ్చారు. రాహుల్ గాంధీ చాలా సార్లు అమెరికా పర్యటించారు. విశ్వవిద్యాలయా లకు వెళ్ళారు. విద్యార్థులను కలిశారు. అన్నిటికంటే ముఖ్యంగా వారి ప్రశ్నలకు జవాబులు ఇచ్చారు. ఆ సమాధానాల నుండి భారతదేశంలో ప్రతిసారీ భారతీయ జనతా పార్టీ ఏదో ఒక వివాదాన్ని  సృష్టించడానికి ప్రయత్నిస్తుంది. రాహుల్ గాంధీ అమెరికాలో ఇచ్చిన సమాధానాలను ఇక్కడ వివాదాస్పదంగా మార్చడానికి అవసరమైన ఐటి సెల్ బీజేపీకి ఉంది, కాని అక్కడి ప్రజలకు రాహుల్ ఏం చెప్పారో, ఇక్కడ జరుగుతున్న ప్రచార మేమిటో అన్ని స్పష్టంగా తెలుసుకునే వీలుంది. బీజేపీ వివాదాన్ని ఎలా సృష్టిస్తుందో కూడా వాళ్ళు గమనిస్తూనే  ఉంటారు. కాంగ్రెస్ కూడా అమెరికా తదితర దేశాల్లో ఉంటున్న ప్రవాస భారతీయులను ఆకట్టుకునే ప్రయత్నం నిరంతరం చేస్తుంది. మరోవైపు రాహుల్ గాంధీ రాజ్యాంగ పరిరక్షణ గురించి మాట్లాడుతున్నారు. కుల గణన, సామాజిక న్యాయం, మైనారిటీలపై దౌర్జన్యాలు, మహిళలపై నేరాలు ప్రతి విషయం లోను ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. అది కూడా ప్రధాన స్రవంతి మీడియా నుంచి ఎలాంటి సహకారం లేకపోయినా తన పోరాటం ఆపడం లేదు. ఈ పోరాట ప్రభావం

కనిపిస్తోంది. మీడియా మద్దతు లేకపోయినా రాహుల్ గాంధీ ఈ స్థాయి ప్రభావం వేస్తుంటే, నిష్పక్షపాత మీడియా ఉన్నట్లయితే మోడీ ప్రభుత్వానికి ఎంత గడ్డు పరిస్థితి ఉండేదో ఊహించవచ్చు. పుల్వామాలో అంత ఆర్‌డిఎక్స్ ఎక్కడి నుండి వచ్చింది? ఎలా వచ్చింది? ఇది ఎవరి వైఫల్యం? అని మీడియా నిలదీసి ఉన్నట్ల యితే 2019లో మోడీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చేదా? 2024లో కూడా మీడియా ఇదే పాత్రను పోషించింది. రాహుల్ గాంధీ ఈ విషయాన్ని నిర్మొహమాటంగా చెబు తున్నారు. ప్రభుత్వంపైనే కాదు, మీడియాపై కూడా తమ పోరాటం అన్నది స్పష్టం చేసి మాట్లాడుతున్నారు. నిజానికి రాహుల్ పోరాటం ఒంటరి పోరాటం. చాలా ప్రతిపక్షాలున్నాయి. కాని ఆయన వెంట ఎంతమంది నిలబడతారన్నది చెప్పలేము. మమతా బెనర్జీ, తేజస్వి యాదవ్, అఖిలేష్ యాదవ్, అరవింద్ కేజ్రీవాల్, స్టాలిన్ వీళ్ళం దరూ తమ తమ సమస్యలపై పోరాడుతారు. తమ పోరాట పరిధిని దాటి ముందుకు రారు. స్టాలిన్‌ది తమిళ భాషకు సంబంధించిన పోరాటం, అఖిలేష్ యాదవ్ యుపికి పరిమితం, మమతా బెనర్జీ బెంగాల్‌కు పరిమితం. చాలా మందికి అదానీని విమర్శించడం ఇష్టంలేదు. కులగణనపై వాళ్ళు నీళ్ళు నములు తున్నారు. కాని రాహుల్ గాంధీ ఎవరు మద్దతివ్వకపోయినా తన పోరాటాన్ని ఆపటం లేదు. కాంగ్రెస్ నాయకులలో కూడా స్లీపర్ సెల్స్ ఆయన్ను దెబ్బతీసే ప్రయత్నాలు చేస్తున్నా ఆయన వెనక్కి తగ్గడంలేదు. మడమతిప్పని పోరాట స్ఫూర్తి, ఓటమి ఒప్పుకోని పట్టుదల ఇప్పుడు ప్రజలు కూడా ఆయనలో చూస్తున్నారు. అందుకే నెమ్మదిగా రాహుల్ గాంధీ వెనుక నిలబడటం మొదలైంది. ✤

# సీనియర్ జర్నలిస్టు, కాలమిస్టు ఉస్మాన్ ఖాన్‌కు జీవన సాఫల్య జాతీయ పురస్కారం

## జులై 20న హిందూపురంలో అవార్డు ప్రదానం

ప్రముఖ కాలమిస్టు, కవి, రచయిత, అనువాదకులు యండి. ఉస్మాన్‌ఖాన్‌కు ప్రతిష్టాత్మక గిడుగు వెంకట రామమూర్తి జీవన సాఫల్య జాతీయ సాహితీ సేవా పురస్కారం–2025 ప్రకటిం చారు. ఈ నెల 20వ తేదీన హిందూపురంలోని సెవెన్ స్టార్ ఫంక్షన్ హాల్‌లో భారత సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ వి. గోపాల గౌడ చేతులమీదుగా ఉస్మాన్‌ఖాన్‌కు ఈ అవార్డును అందజేయనున్నారు.




తెలుగు సాహిత్యంలో విశిష్ట స్థానం సంపాదించుకున్న గిడుగు వెంకట రామమూర్తి స్మరణలో ప్రతీ సంవత్సరం ఈ అవార్డు అందజేస్తుంటారు. యండి. ఉస్మాన్‌ఖాన్ తమ రచనల ద్వారా తెలుగు, ఉర్దూ, భాషల్లో అనేక సామాజిక సమస్యలపై రచనలు చేసి ప్రత్యేక గుర్తింపు పొందారు.

ఉస్మాన్‌ఖాన్ గత మూడున్నర దశాబ్దాలుగా తెలుగు భాషల్లో సాహిత్యరంగానికి సేవలందిస్తున్నారు. సమకాలీన సామాజిక అంశాలపై విశ్లేషణాత్మక కాలమ్స్, కవిత్వం, పత్రికా రచనలు చేశారు. ఆయన విశిష్ట సేవలను గుర్తించి లైఫ్ టైం అచీవ్ మెంట్ అవార్డు అందజేయనున్నట్లు నిర్వాహకులు పేర్కొ న్నారు. భారతీయ తెలుగు సాహిత్య అకాడమీ, సత్యసాయి రచయితల సంఘం, అఖిల భారత షహీద్ టిప్పుసుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుంది.

ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొననున్నారు. భారత సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ వి. గోపాల గౌడ, ప్రముఖ గజల్ దిగ్గజం గజల్ శ్రీనివాస్, ఆచార్య రవిశంకర్ గురూజీ, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు మెళవాయి గోవిందరెడ్డి, విశ్వవిజ్ఞాన విద్యాపీఠం నవమ పీఠాధిపతి డాక్టర్ ఉమర్ అలీషా, ప్రముఖ సంఘ సేవకుడు కల్లూరు ఉమర్ ఫారూఖ్ తదితరులు పాల్గొంటారు.

7/2

# కలిసి వచ్చిన కూడలి

ఎస్.ఎమ్. మలిక్

## మహనీయ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్

### చురుకయిన కార్యకర్త గా ఉహుద్‌లో

ఉహుద్ పోరాటంలోనూ ఆయన పాల్గొన్నారు, ఇందులో ఆయన చూపిన ధైర్య సాహసాలు, శౌర్యం కొనియాడదగ్గవి. ఈ పోరాటంలో గాయపడ్డ తరువాత ప్రవక్తశ్రీ(స) ఉహుద్ కొండ కనుమ చాటున నిల్చోగా ఉబై బిన్ ఖలఫ్ దృష్టి పడింది. అతను ఆయన వైపునకు రావడం గమనించిన అబ్దుర్రహ్మాన్, అతని వైపునకు అడుగు వేశారు. ప్రవక్తశ్రీ(స) ఆయన్ని ఆపి, స్వయంగా తానే ఓ సిపాయి చేతిలోని బల్లెం తీసుకుని ఉబై బిన్ ఖలఫ్ మెడపై విసిరారు. అతను కేకలు వేసుకుంటూ పరిగెత్తాడు. ఆ పైన మక్కా దారిలో చనిపోయాడు. ఒక ఉల్లేఖనం ప్రకారం, ఈ పోరులో మహనీయ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ శరీరం పైన ఇరువైకు పైగా గాయాలయ్యాయి.

### ధర్మ సందేశం

హిజ్రీ 6వ సంవత్సరం మదీనాకు ఉత్తరాన దాదాపు 300 మైళ్ళ దూరాన గల దూమతుల్ జన్దల్ అనే చోట ధర్మ ప్రచారం కొరకు ఒక బృందం పంపాలని అనుకున్నారు ప్రవక్త మహనీయులు. ఆ బృందం నాయకత్వం కొరకు మహనీయ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్‌ని ఎన్నుకున్నారు. ఆయన్ని పంపుతూ తలపై పాగ తీసి ఆయన(స) స్వయంగా తన చేతులతో కట్టారు, దుఆ చేశారు. ఇంకా, “అక్కడికి వెళ్లి సానుభూతిగా, వివేచనతో దైవ ధర్మాన్ని పరిచయం చేసి ఇస్లామ్ సందేశాన్ని అందజేయి. దాన్ని స్వీకరిస్తే అది వారికే మేలని, ఇహపరాల సాఫల్యం అనీ బోధించు” అని ఉపదేశించారు.

మహనీయ అబ్దుర్రహ్మాన్ దూమతుల్ జన్దల్ చేరి ప్రవక్తశ్రీ (స) ఉపదేశించిన విధంగా ధర్మ పరిచయం చేశారు. అక్కడి నాయకుడు అస్బగ్ బిన్ అమ్ర్ కల్బీ క్రైస్తవుడు, ప్రవక్త ఆవిర్భావం గురించి బైబిల్ గ్రంథాలలోని శుభ వార్తలు, ఇస్లామ్ బోధించే కొన్ని అంశాలు విని ఇస్లామ్ స్వీకరించడానికి సిద్ధం అయ్యాడు. ఆ పైన ప్రవక్తశ్రీ(స) ఆదేశం మేరకు అతని కూతురుతో వివాహానికి ప్రస్తావన అతని ముందు పెట్టారు. ఆ నాయకుని కూతురుతో పెళ్ళి జరుగుతుంది.

## మక్కా విజయం, ఆ తరువాత

మక్కా విజయానికి (హిజ్రీ 8వ సంవత్సరం) బయలుదేరిన సందర్భంలో మహనీయ అబ్దుర్రహ్మాన్, ముహాజిరుల దళంలో ప్రవక్తశ్రీ(స) నాయకత్వాన వెళ్ళారు. ఆ తరువాత అరేబియా చుట్టుపట్ల ప్రదేశాలకు ఇస్లామ్ సందేశం అందజేసేందుకు అనేక బృందాలు పంపారు ప్రవక్త మహనీయులు(స). అరేబియాలోని ముష్రికులయిన (బహుదైవారాధకులు) వారు అజ్ఞానులూ మూర్ఖులు కూడా కాబట్టి ధర్మ ప్రచారానికి వెళ్ళేవారు సాయుధు లయి మరీ వెళ్ళేవారు, దాడి జరిగితే ఆత్మ రక్షణ కొరకు.

హిజ్రీ 9వ సంవత్సరం తబూక్ పోరాటం కొరకు సన్నాహాలు చేస్తున్న సందర్భంలోనూ మహనీయ అబ్దుర్రహ్మాన్ ఎంతో ఆసక్తి, ఉత్సాహంతో పాల్గొన్నారు. ధనం ద్వారానూ ఆచరణాత్మకంగానూ ఎటువంటి కొదువ రానివ్వకుండా తన పాత్ర నిర్వహించారు. వాస్తవానికి ఆ కాలంలోనే క్షామం వల్లనూ చాలా కాలంగా ప్రతీప శక్తులతో పోరాడుతూ బాగా అలసిపోయి అనూహ్యమయిన పరీక్షలు ఎదుర్కొంటున్నారు ముస్లిములు. అయినా సత్య పరిరక్షణ, మిథ్యావాదుల సంహారం వారిలో సరికొత్త ఉత్సాహాన్ని, ఉద్వేగాన్ని నింపేది.

## అపూర్వమయిన ధన త్యాగం

ఆ రోజుల్లో కరువు కాటకాల వల్ల ఆర్థికంగా బాగా క్రుంగిపోయి ఉన్న ముస్లిములకు ఈ సంకట పరిస్థితి ఎదురయింది. కొంత ఉపశమనంగా అప్పుడప్పుడే ఖర్జూర పంట అందుకోవాలని తలపోస్తున్న వారికి ఈ పిలుపు అందుకోవడం అవసరమయింది. ఆ సందర్భంలోనే ముస్లిములకు తమ త్యాగశీలత, ప్రాణార్పణ దీక్ష ప్రదర్శనకు తగిన అవకాశం ప్రాప్తమయింది. ఆ నాటి వారి దృష్టాంతం తరువాతి వారి కొరకు ఆదర్శ ప్రాయమయింది.

మహనీయులు అబూ బక్ర్ సిద్దీక్, ఉస్మాన్, అబ్దుర్రహ్మాన్ ప్రభృతుల ధన త్యాగం దాటజాలని రికార్డు సృష్టించింది. నిరుపేద సహచర మాన్యులు సయితం తాము కూలీ నాలీ చేసుకుని సంపాదించుకున్నదంతా ఆనాటి జిహాద్ ఫండ్ లో జమ చేశారు. మహనీయ అబ్దుర్రహ్మాన్ ఎనిమిది వేల దీనారులు సమర్పించు కుంటే ఆయనకు వెంటనే మరో త్యాగశీలి రాత్రి అంతా తోటకు నీరు తోడిన సంపాదన మొత్తం రెండు శేర్ల ఖర్జూరాలు అర్పించు కున్నారు. కపటులు ఇదంతా చూసి తమలో తాము గుసగుస లాడుకున్నారు. సకల లోక ప్రభువు వారి మంతనాలను ప్రవక్తశ్రీకి వహీ ద్వారా ఎరుకపరిచారు.

ఏమిటీ, వీరికి తెలియదా, వారి రహస్య సమాలోచనలు, గుసగుసలు అల్లాహ్‌కు బాగా తెలుసు అని? (ఆయనకు బాగా తెలుసు ఆ పిసినారి ధనవంతుల్ని గురించి) వారు ఇష్ట పూర్వకంగా విరాళాలు ఇచ్చే విశ్వాసుల ధన త్యాగం పట్ల కోతలు కోస్తారు. ఇంకా (దైవ మార్గంలో సమర్పించుకునేందుకు) తమ కష్టార్జితం తప్ప ఏమీలేక అర్పించుకున్న దాని పట్ల అవహేళన చేస్తారు. అల్లాహ్ ఈ అవహేళనా పరులను అవహేళన చేస్తున్నాడు. ఇంకా వారికి ఆవేదనా భరితమయిన శిక్షా ఉంది.

*(అత్ తౌబా 9 : 78,79)*

## నమాజ్ నాయకత్వం

గవర్నర్ గస్సానీకి, కైసర్‌కు ప్రవక్త మహనీయులు(స) ముప్ఫైవేల మంది ప్రాణార్పణ చేసుకునే శూరులతోపాటు వస్తున్నారన్న సమాచారం అంది తమ సేనా దళాలను తిరిగి పిలిపించుకున్నారు. వారు ఎదుర్కొనే సాహసం చేయలేకపోయారు. ప్రవక్తశ్రీ (స) సిరియా సరిహద్దు ప్రాంతంలో తబూక్ వద్ద ఇరువై రోజులు మకాం చేశారు. ఆ చుట్టు పక్కల రోమనుల అధీనంలోని క్రైస్తవ పాలకులు ప్రవక్తశ్రీ(స) పరిశుద్ధ సముదాయం నైతిక నడవడి, దానికి సమానంగానే ధైర్యసాహసాలు గమనించి ఎంతో ప్రభావితు లయ్యారు. అందువల్ల ఆ పాలకులందరూ ఇస్లామీయ రాజ్యా నికి కప్పం కట్టి సామంతులయ్యారు.

తబూక్‌లో ఆ కాలంలోనే ఒక రోజు ప్రవక్తశ్రీ (స) ఫజ్ర్ నమాజ్‌కు పూర్వం కాలకృత్యం కొరకు పొదల చాటున వెళ్ళారు. తిరిగి వస్తూ ఆయన (స) వుజూ చేసి వచ్చే వరకు కాస్త ఆలస్య మయింది. అంతలో నమాజ్ వేళ కావడంతో జనులు మహనీయ అబ్దుర్రహ్మాన్‌ని నమాజ్ నాయకత్వం కొరకు చెప్పగా ఆయన నమాజ్ చేయించేందుకు నిలబడి ప్రారంభించారు. ప్రవక్తశ్రీ (స) వచ్చే వరకు ఒక రకాత్ నమాజ్ అయింది. అబ్దుర్రహ్మాన్ కు ప్రవక్త వచ్చారన్న స్పృహ కలగగానే వెనక్కి జరగ యత్నించ సాగారు. దానికి ఆయన (స) సంజ్ఞ చేశారు వద్దని. అప్పుడు ఆయన (ర) నమాజ్ పూర్తి చేశారు.

## ఖిలాఫత్ కాలంలో

మహనీయ అబూబక్ర్ సిద్దీక్ (ర) వ్యాధిగ్రస్తులయి నయం అయ్యే సూచనలు లేకపోవడంతో ఆయన(ర) తన స్థానంలో ఖలీఫాగా మహనీయ ఉమర్ (ర) పేరు ప్రతిపాదించారు. ఆ విషయంలో ఇతర ప్రముఖ సహచర మాన్యులతో సంప్రతించారు కూడా. ఈ అత్యంత ముఖ్యమయిన సంప్రతింపుల్లో మహనీయ అబ్దు ర్రహ్మాన్ కూడా పాల్గొన్నారు. ఆ సమయంలో మహనీయ అబూ

బక్ర్, మహనీయ ఉమర్ గుణగణాలను గురించి ప్రస్తావించగా అబ్దుర్రహ్మాన్, "మీరు చెప్పేది వాస్తవమే కాని ఆయన సహజంగా కాస్త కఠిన వ్యక్తి" అన్నారు. దానికి మహనీయ అబూ బక్ర్, "నా మెతక వైఖరి కారణంగా ఆయన ఇలా ఉన్నారు, ఖిలాఫత్ భారం పడితే నెమ్మదిస్తారు" అని సముదాయిస్తారు.

ఈ ఉదంతం ద్వారా ఆయనలోని ఆలోచనా పరిధి, వివేచన, సామంజస్యత వ్యక్తమవుతున్నాయి. ఆయనలోని ఈ గుణాల కారణంగానే మహనీయ అబూ బక్ర్ సిద్దీక్ (ర), ధార్మిక తీర్పులు చేసే అనుమతి నిచ్చిన ఏడుగురు సహచర మాన్యులలో ఆయన్నీ చేర్చారు. కేవలం ఆ ఏడుగురు సహచర మాన్యులకు తప్ప ఇతరులు ఎవరికీ ఆ అనుమతి లేకుండా పోయింది. మహనీయ ఉమర్ (ర) తన కాలంలో ఇతరులకు ధార్మిక తీర్పులు చేయ కుండా గట్టిగా వారించారు. మహనీయ అబ్దుల్లా బిన్ మస్ఊద్ (ర)ని స్వయంగా మహనీయ ఉమర్(ర) ఖజీనతుల్ ఇల్మ్ (విజ్ఞాన ఖని) అని అనేవారు. కాని ఆయన కూడా అనుమతి లేనిదే ధార్మిక విషయాల్లో తీర్పు ఇవ్వడం వల్ల ఆయన్నీ వారించారు.

## ముఖ్య స్థానంలో

మహనీయ ఉమర్ ఫారూక్(ర) తన ఖిలాఫత్ కాలంలో మహ నీయ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్‌ని తన ముఖ్య సలహాదారుగా నియమించారు. ఒకసారి మహనీయ ఉమర్(ర) మామూలు ప్రకారం రాత్రి పూట జనుల మంచీ చెబ్బర విచారణ కొరకు మహనీయ అబ్దుర్రహ్మాన్‌ని తోడుగా తీసుకుని బయలు దేరారు. దూరాన ఓ ఇంటి నుంచి బాగా వెల్తురు రావడం గమనించి అటు వెళ్ళగా ఇంటి తలుపులు మూసి ఉన్నాయి, లోపల గలభా జరుగుతోంది.

మహనీయ ఉమర్ (ర) మహనీయ అబ్దుర్రహ్మాన్ ని అడిగారు, "లోపలి నుంచి వస్తున్న శబ్దాలు విన్నావా?"అని.

"అవును విన్నాను" అన్నారు అబ్దుర్రహ్మాన్.

"వారు మాటలాడుకునేది అర్థమవుతోందా?" అని అడిగారు మహనీయ ఉమర్.

అబ్దుర్రహ్మాన్, "ఒకేసారి అందరూ మాటలాడుకోవడం వల్ల ఏమీ అర్థం కావడం లేదు గోలగా ఉంది" అన్నారు.

"ఇది ఎవరి ఇల్లో తెలుసా"? అడిగారు మహనీయ ఉమర్.

"ఇదయితే రబీఅ బిన్ ఉమయ్య ఇల్లు కదా" అన్నారు అబ్దు ర్రహ్మాన్.

"వీరంతా సారాయి త్రాగి మత్తు గొన్నారు, నీవేమంటావు" అడిగారు ఖలీఫా.

దానికి అబ్దుర్రహ్మాన్, "దైవం మనల్ని ఇతరుల విషయాల్లో ఉత్సుకత చూపరాదని ఆదేశించాడు, "ఇంకా ఇతరుల విషయా లను, చేష్టల్నీ తెలుసుకునేందుకు ఉత్సుకత చూపకండి"అని, ఇంకా "మీకు తెలియని విషయాన్ని తెలుసుకునేందుకు దాని వెంట పడకండి" (బనీ ఇస్రాయీల్ 17:36) అని ఆదేశించడం జరిగింది కదా" అని సమాధానం ఇచ్చారు.

"నీవు చెప్పింది నిజం, సరయిన సమయాన గుర్తు చేశావు" అంటూ మహనీయ ఉమర్(ర) అక్కడి నుంచి ముందుకు సాగారు.

## దీని ప్రయోజనం

మహనీయ అబ్దుర్రహ్మాన్ ఖలీఫాకు గుర్తు చేసిన దివ్య ఖుర్ఆన్ వచనం, సామూహిక వ్యవస్థలో వ్యక్తి యొక్క ప్రాథమిక హక్కు లకు ప్రాణం లాంటిది. దీని భావం, జనుల మంచీచెడులను గురించి అనుమానాల ఆధారంగా కాక తమకు తెలిసిన యదా ర్థాల ప్రకారం ఆచరించాలి. ఇస్లామీయ సమాజంలో ఈ భావాన్ని, జీవితంలోని అన్ని విభాగాల్లో, నైతిక, శాసనాంగ, రాజకీయ, యంత్రాంగ, కళలు విద్యా విభాగాల్లో అనుసరించడం అవసర మని నిర్దేశించడం జరిగింది. అప్పుడే ఎల్లెడలా అన్ని విధాల అన్యాయం దౌర్జన్యాల నుంచి విముక్తి లభిస్తుంది.

ఈ ఆదేశం వల్ల విద్యా వ్యవస్థలో, కేవలం ఊహాజనితమయిన శాస్త్రాలన్నింటినీ త్రోసిపుచ్చటం జరిగింది. అన్నింటి కన్నా అధికంగా సకల మూఢనమ్మకాల నిర్మూలన జరిగింది. దివ్య ఖుర్ఆన్‌ని విశ్వసించే వారికి దీని ద్వారా బోధించినదేమిటంటే వారు కేవలం దైవం, దైవ ప్రవక్త అనుగ్రహించిన బోధనల రీత్యా రుజువయిన దాన్నే నమ్మాలి. ఇతర ఊహాజనితమయిన జ్ఞానం సర్వం విసర్జనీయం. ✤

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక



# ఆహ్! అబ్దుర్రజ్జాఖ్ సాబ్!

**జమాఅతె ఇస్లామీ హింద్ సభ్యులు, అక్బర్‌బాగ్ (హైదరాబాద్) నివాసి జనాబ్ అబ్దుర్రజ్జాఖ్ 'మర్హూమ్'ల జాబితాలో చేరిపోయారు. కారుణ్య ప్రభువు ఆయన యెడల ప్రసన్నుడవుగాక! ఆయన్ని మన్నించి స్వర్గంలో ఉన్నత స్థానం కల్పించుగాక!**

అబ్దుర్రజ్జాఖ్‌కు 60 ఏండ్లు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యానికి గురై ఉన్నారు. 4-7-2025 శుక్రవారం నాడు ఆయనకు హైదరాబాద్ కేర్ హాస్పిటల్‌లో ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగింది. 11-7-25వ తేదీ శుక్రవారం నాడు ఆయన హాస్పిటల్ నుండే ఎప్పటికీ మరలిరాని ఊర్ధ్వలోకాలకు సాగి పోయారు. ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్. 12వ తేదీ ఫజ్ర్ నమాజ్ అనంతరం హైదరాబాద్‌లో అంత్యక్రియలు జరిగాయి.

మర్హూమ్ అబ్దుర్రజ్జాఖ్ కుటుంబీకులంతా గత 70 ఏళ్ళుగా తహరీకె ఇస్లామీతో ప్రగాఢమైన సంబంధం ఉన్నవారే. పామర్రు వాస్తవ్యులైన ఈయన తాత గారు (జలాలుద్దీన్ యూసుఫీ) మంచి దాయీ, వక్త, రచయిత. ఇస్లామ్‌ను ప్రాంతీయ భాషలో పరిచయం చేయాలన్న ఆలోచనకు ఆద్యుడు. 1960ల్లోనే ఆయన ఆం.ప్ర. కృష్ణా జిల్లా పామర్రులో 'తెలుగు పబ్లికేషన్స్'ను స్థాపించి, తెలుగులో రచనలకు, అనువాదాలకు శ్రీకారం చుట్టారు. తొలికాలంలో ఆయన రచించిన 'యథార్థమేది?', 'లోకశాంతికి దైవ సూత్రాలు' తదితర చిరు పుస్తకాలు ఇప్పటికీ టి.ఐ.పి సంస్థలో ఉన్నాయి. 1970 తరువాత మౌలానా అబ్దుల్ అజీజ్, మౌలానా అబ్దుర్రజ్జాఖ్ లతీఫి, తదితర జమాఅత్ ప్రముఖులు ఇచ్చిన సలహా మేరకు ఆ కుటుంబీకులు ఎంతో వినయంతో ఆ పబ్లికేషన్స్‌ను జమాఅత్‌కు స్వాధీనం చేశారు. ఆ తెలుగు పబ్లికేషనే 1975లో 'తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్'గా రూపాంతరం చెందింది.

మర్హూమ్ అబ్దుర్రజ్జాఖ్ గారి తండ్రి జనాబ్ మీరాన్ మొహియుద్దీన్ (అజీజ్ జాని) గారు విజయవాడ లబ్బీపేటలోని 'దర్స్‌గాహె ఇస్లామీ' విద్యా సంస్థకు 50 ఏళ్ళపాటు ఫౌండర్ సెక్రెటరీగా సేవలందించారు. 92 ఏళ్ల వయసులో గుండె దిటవు చేసుకుని కొడుకు కడసారి యాత్రలో పాల్గొనడానికి విజయవాడ నుంచి వచ్చిన ఆ పండుటాకును చూసినప్పుడు గుండె తరుక్కు పోయింది. కాని ఆ 'పెద్ద మనిషి' నగుమోముతో పలకరిస్తూ ఏమాత్రం తొణక్కుండా మొక్కవోని సాహసాన్ని, నిగ్రహాన్ని ప్రదర్శిస్తూ ఖననవాటికకు నడిచి రావటం విశేషం!

మర్హూమ్ అబ్దుర్రజ్జాఖ్ గారి బాబాయి మౌలానా అబ్దుల్లాహ్ ఉమ్రీ గారు కూడా రుక్నె జమాఅత్. ఈయన ఆంధ్రప్రదేశ్ జమాఅత్ ఆధ్వర్యంలోని 'విఫాఖుల్ ఉలమా' కమిటీలో సభ్యులు కూడా.

1977 నవంబర్ 19వ తేదీన కృష్ణా జిల్లా దివి సీమలో ఉప్పెన వచ్చినప్పుడు జమాఅతె ఇస్లామీ 'పామర్రు'ను కేంద్రంగా చేసుకుని రిలీఫ్ వర్క్ చేసింది. ఆ సందర్భంగా ఈ కుటుంబీకులు అందించిన తోడ్పాటు కూడా చిరస్మరణీయమే.

2006లో ఉద్యోగం నిమిత్తం సఊదీ అరేబియాలోని 'అబ్‌హా'కు వెళ్ళిన అబ్దుర్రజ్జాఖ్ గారు, అక్కడి జమాఅత్ కార్యకర్త ఫయ్యాజ్ గారి శిక్షణలో ఉండి, అక్కడే జమాఅత్ సభ్యత్వం పొందారు. అనారోగ్య కారణాల దృష్ట్యా 2019లో హైదరాబాద్‌కు తిరిగి వచ్చేశారు. కడకు ఆయన 11-7-2025 శుక్రవారం నాడు ఇహలోకం నుండి శాశ్వతంగా సెలవు తీసుకుని, పరలోక పయనం చేశారు.

**"నెమ్మదించిన మనసా! పద నీ ప్రభువు సన్నిధికి, (నీకు లభించే సత్ఫలానికి) ఆనందిస్తూ. మరియు (నీ ప్రభువునకు) ఇష్టమైన దానివై. చేరిపో (పుణ్యాత్ములైన) నా దాసులలో, ప్రవేశించు నా స్వర్గంలో."** *(అల్ ఫజ్ర్ : 27-30)*

అల్లాహ్ ఆయన తప్పులను మన్నించి తన కారుణ్యఛాయలో చోటివ్వాలనీ, ఆయనకు అనుగ్రహభరితమైన స్వర్గంలో ప్రవేశం కల్పించాలని ప్రార్థన (ఆమీన్). ✤

**- అజీజుర్రహ్మాన్**



# విభిన్నంగా ఆలోచించండి

**డా. ముహమ్మద్ హసన్**

**"విభిన్న ఆలోచనయే సృజనాత్మకత"** అంటాడు అమెరికన్ మనస్తత్వవేత్త J.P గిల్ఫోర్డ్ (1897–1987). అంటే ఒక సమస్యకు కొత్త పరిష్కారం, కొత్త పద్ధతి లేదా పరికరం లేదా కళాత్మక వస్తువు, రూపం (Shape) ఏదైనా కొత్తదాన్ని తయారు చేయగలిగే, ఉనికిలోనికి తీసుకొని రాగలిగే సామర్థ్యాన్ని "సృజనాత్మకత" అనవచ్చు. సహజంగా సృజనాత్మకత కలిగిన వ్యక్తుల స్వయంప్రతిపత్తి, ఆలోచనలు, చర్యలు, విరుద్ధంగా వుంటాయి. అలాగే మిగిలిన వారి నైపుణ్యాలకన్నా వీరి నైపుణ్యాలు భిన్నంగా వుంటాయి. ఇటలీ చిత్రకారుడు లియోనార్డో డావిన్సి గీసిన "మోనాలిసా" చిత్రం సృజనాత్మకతకు చక్కని ఉదాహరణగా చెప్పుకోవచ్చు. అంతెందుకు ఈరోజు వరకు జరిగిన, జరుగుతున్న శాస్త్ర సాంకేతిక రంగాల్లో వస్తున్న, అలాగే జన్యు విభాగాల్లో, వ్యవసాయ పంటల్లో వస్తున్న నూతన మార్పులన్నీ సృజనాత్మకమైన భిన్న ఆలోచనల నుండి వచ్చినవే కావడం గమనార్హం. మరి సృజనాత్మకత కల్గిన వ్యక్తుల జననం సాధారణమైనదే. వారి ప్రజ్ఞాలబ్ధి (IQ) కూడా కొన్ని సందర్భాల్లో సాధారణమైనదిగాను మరికొన్ని సందర్భాలో అసాధారణమైనదిగాను ఎన్నో పరిశోధనల్లో తేలింది. దానికి ఉదాహరణగా ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త ఐన్‌స్టయిన్ మెదడుపై ఎన్నో పరిశోధనలు జరిగాయి.

అంతెందుకు ప్రపంచ వింతల్లో ఒకటిగా భావిస్తున్న "తాజ్ మహల్" రూపశిల్పి ఉస్తాద్ అహ్మద్ లహరి సృజనాత్మక రూపమే అందమైన పాలరాతి కట్టడం. అది దాదాపు నాలుగు వందల సంవత్సరాలుగా ఎంతో మంది పర్యాటకులను ఆకర్షిస్తూనే ఉంది. ఇలా చెప్పుకుంటూ పోతే దొరికే ఉదా హరణలు ఎన్నో ఉంటాయి. ఇక్కడ మనం చేయాల్సిందల్లా మన ముందువున్న సమస్యను, లేదా పనిని విభిన్నంగా చేయడమే. అంటే ఇక్కడ 2X2=4 అవుతుంది. దీనికి సృజనాత్మకంగా 2X2=6 అంటే కుదరదు. విశ్వజనీనమైన సమాజ ఆమోదయోగ్యమైన నూతన ఆలోచనను, సిద్ధాంతాన్ని ఆవిష్కరించి మీరు నిరూపించాల్సి వుంటుంది. అలాగే భూమికి గురుత్వాకర్షణ శక్తి వుందని చెప్పిన న్యూటన్ సిద్ధాంతం ఆధారంగానే నేటికి ఎన్నో పరిశోధనలు జరుగుతున్నాయి. ఇక ముందూ జరుగుతాయి కూడా.

తరగతి గదిలో లేదా సమాజంలో మీ కంటికి కనిపిస్తున్నవి, మీరు చూడనివి ఏవైనా వుంటే ఓ నూతన దృక్పథంతో చూడండి, తార్కికంగా, సృజనాత్మకంగా ఆలోచన చేయండి, ఒక కొత్త సూత్రానికి మీరు నాంది పలకండి. మీరు చేపట్టిన ఏ ప్రాజెక్ట్ ఐనా లేదా పరిశోధన ఐనా దానికి ఓ ప్రామాణికతను కల్పించండి. అప్పుడు మీరు సృజనాత్మకమైన వ్యక్తులుగా పరిగణింపబడుతారు. అంతెందుకు "కవిత్వం" అనేది ఓ సృజనాత్మకమైన ప్రక్రియ, మరి అది అందరికి ఎందుకు సాధ్యం కావడం లేదు చెప్పండి. అంటే విభిన్నంగా ఆలోచించే వారి సంఖ్య సమాజంలో చాలా తక్కువగా వుంటుంది. వారిలో మీరు ఒకరిగా వుండాలి అంటే మీ మెదడుకు పదును పెట్టండి. దాని కోసం మీరు మీ ఆహారపు నియమాలు, ఆరోగ్య సూత్రాలు కొత్తగా పాటించాల్సిన అవసరం లేదు. మీరు చేయాల్సిందల్లా మీ మెదడుకు పదును పెట్టి కవిత్వ నిర్మాణ పద్ధతులు తెల్సుకోవడమే.

బల్బును కనిపెట్టిన ఆనందంలో ఎడిసన్ వున్నప్పుడు అక్కడికి ఓ వ్యక్తి "మీరు ఏం నేర్చుకున్నారు" అని అడగగానే అప్పుడు ఎడిసన్ తొమ్మిది వందల తొంబై తొమ్మిది (999) పాఠాలు నేర్చుకున్నాను అన్నాడట. అంటే విషయం మీకు ఈపాటికె అర్థమై వుంటుంది. కాబట్టి మీరు కూడా సృజనాత్మకంగా ఆలోచించండి, మీ ఆలోచనలలో నవ్యతకు నాంది పలకండి. ✤

# రాబోయే బిహార్ ఎన్నికలలో పస్మాందా ముస్లింలు ఎటు?

- సల్మాన్ హైదర్



**రాబోయే బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు** ఇంకా కొన్ని నెలల దూరం ఉంది. భారతీయ జనతా పార్టీ (బిజెపి) పస్మాందా ముస్లిములను ఆకర్షించే ప్రచార కార్యక్రమం ఆరంభించినది. బిహార్‌లో పస్మాందా ముస్లిం సమాజం మద్దతు పొందుతామని బిజెపి విశ్వాసం వ్యక్తం చేస్తున్నప్పటికీ, రాజకీయ విశ్లేషకులు పస్మాందా ముస్లిములు బి.జే.పి పార్టీకి దూరంగానే ఉంటారని భావిస్తున్నారు.

లాలూ ప్రసాద్ యాదవ్ నేతృత్వంలోని రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్‌జెడి)ను బలహీనపరిచే వ్యూహంగా బిజెపి ముస్లిం ఓటును విభజించడానికి పస్మాందా విభాగంలో గందరగోళాన్ని సృష్టించడానికి ప్రయత్నిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు – ఇది ప్రధానంగా లాలూ ప్రసాద్ యాదవ్ నేతృత్వంలోని రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్‌జెడి)ను బలహీనపరిచే వ్యూహంగా భావిస్తున్నారు. బిహార్‌లో ప్రస్తుతం ఆర్జేడీ, దాని మిత్రపక్షాలు (కాంగ్రెస్ మరియు వామపక్షాలు) ముస్లింల మద్దతును ఎక్కువగా పొందుతున్నాయి, ముస్లిం సమాజం బిహార్ రాష్ట్ర జనాభాలో దాదాపు 17.7% ఉంది.

బిహార్‌లోని సుమారు 72% ముస్లింలు అనధికారిక "పస్మాందా" వర్గంలోకి వస్తారు – వారు ఇతర వెనుకబడిన తరగతులు (OBC) లేదా అత్యంత వెనుకబడిన తరగతులు (EBC)కి చెందినవారు.

243 అసెంబ్లీ నియోజక వర్గాలలో కనీసం 30 చోట్ల, ముఖ్యంగా కిషన్‌గంజ్, అరారియా, పూర్ణియా, కతిహార్, మధుబాని, సివాన్, భాగల్పూర్, బెగుసరాయ్, దర్భంగా, ఇతర జిల్లాల్లో ముస్లిం ఓట్లు నిర్ణయాత్మకంగా పరిగణించబడతాయి. పస్మాందా ముస్లింలలో కుంజ్రా, అన్సారీ, మన్సూరి, రైన్, దర్జీ, నై, బఖో, లోహార్, థథేరా, ఫకీర్ వంటి సంఘాలు ఉన్నాయి.

ప్రచార ప్రయత్నాలలో భాగంగా, బిజెపి మైనారిటీ సెల్ ఈ సంవత్సరం ఈద్ సందర్భంగా 'సౌగత్–ఎ–మోడీ' కార్యక్రమాన్ని ప్రారంభించింది. పేద ముస్లింలలో కిట్లు (ఆహార పదార్థాలు, బట్టలు) పంపిణీ చేసింది. గతంలో, నవంబర్ 26, 2022న, రాజ్యాంగ దినోత్సవం నాడు బిజెపి పాట్నాలో పస్మాందా ముస్లింలను లక్ష్యంగా చేసుకొని ఒక కార్యక్రమాన్ని నిర్వహించింది,

2022లో హైదరాబాద్‌లో జరిగిన పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశంలో "అణగారిన, బలహీన పస్మాందా ముస్లింలను అక్కున చేర్చుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు ఇచ్చారు.. 2023 సెప్టెంబర్‌లో భాగల్పూర్‌కు చెందిన పస్మాందా ముస్లిం అయిన ఖమ్రుజ్జమా అన్సారీని బిజెపి పార్టీ తన మైనారిటీ విభాగానికి అధ్యక్షుడిగా నియమించింది.


అష్రఫ్ (ఎలైట్) ముస్లిం నాయకత్వం నేతృత్వంలోని మునుపటి ప్రభుత్వాల క్రింద పస్మాందా ముస్లిములకు సంక్షేమ కార్య క్రమాలు నిరాకరించబడ్డాయని బిజెపి పార్టీ వాదిస్తోంది.

బిహార్ బిజెపి ప్రకారం ప్రత్యక్ష ప్రయోజన బదిలీలు (డిబిటి), పిఎం విశ్వకర్మ పథకం వంటి సంక్షేమ కార్యక్రమాల ద్వారా "పస్మాందా ముస్లిములను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడం"

# చరిత్రకారులు సయ్యద్ నశీర్ అహమ్మద్‌కు
# "డాక్టర్ దాశరథి రంగాచార్య జీవన సాఫల్య పురస్కారం"

ప్రముఖ చరిత్రకారులు, బహుగ్రంథ రచయిత, సీనియర్ పాత్రికేయులు సయ్యద్ నశీర్ అహమ్మద్‌కు హిందూపురంకు చెందిన అఖిల భారత ఫ్రీడం ఫైటర్ షహీద్ టిపూ సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ "డాక్టర్ దాశరథి రంగాచార్య జీవన సాఫల్య పురస్కారం" ప్రకటించింది.

భారత స్వాతంత్ర్యోద్యమంలో ముస్లిం జన సముదాయాలు నిర్వహించిన సాహసోపేత, త్యాగమయ పాత్రను వివరిస్తూ, గత మూడు దశాబ్దాలుగా రచనా వ్యాసంగం సాగిస్తున్న నశీర్ అహమ్మద్ తెలుగులో 25 పరిశోధనాత్మక చరిత్ర గ్రంథాలను రచించి, వెలువరించారు. ఆయన వెలువరించిన పలు గ్రంథాలు ఆంగ్లం, ఉర్దూ, హిందీ, తమిళం, కన్నడం, గుజరాతి భాషలలో కూడా అనువదించబడి వెలువడ్డాయి. చరిత్ర రంగాన మూడు దశాబ్దాలుగా సయ్యద్ నశీర్ అహమ్మద్ అవిశ్రాంతంగా సాగిస్తున్న అవిరళ కృషికి గుర్తింపుగా ప్రస్తుతం ఈ ప్రతిష్టాత్మక పురస్కారం అందజేయనున్నామని శ్రీ ఫారూఖ్ ఖాన్ వెల్లడించారు. ఈ నెల 20న హిందూపురంలో జరగనున్న "భారత ముస్లిం లెజెండ్స్" పుస్తకావిష్కరణ సందర్భంగా ఏర్పాటు కానున్న భారీ బహిరంగ సభలో ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని సయ్యద్ నశీర్ అహమ్మద్‌కు




అందజేయనున్నామని శ్రీ కల్లూరి ఉమర్ ఫారూఖ్ వెల్లడించారని సయ్యద్ నశీర్ అహమ్మద్ తనను కలసిన విలేకరులకు వివరించారు.

అనే మోడీ దార్శనికతను సాక్ష్యం అని అంటుంది.

బిహార్‌లో, పస్మాందా రాజకీయాలను మొదట చురుకుగా ప్రోత్స హించింది నితీష్ ప్రభుత్వం సామాజిక-ఆర్థిక అణగారిన వర్గాల నుండి కొంతమంది నాయకులను రాజ్యసభకు నామినేట్ చేయడం కూడా జరిగింది. నితీష్ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం పస్మాందా ముస్లింల కోసం 800 కంటే ఎక్కువ ఖబ్రస్తాన్‌ల (ఖనన వాటికలు) సరిహద్దు గోడల నిర్మాణాన్ని చేసింది.

వివాదాస్పద వక్ఫ్ (సవరణ) చట్టానికి వ్యతిరేకంగా బిహార్ కూడా వ్యతిరేకతకు బలమైన కోటగా ఉద్భవించింది. అయితే, కొత్త వక్ఫ్ చట్టం పస్మాందా సమాజానికి ప్రయోజనం చేకూరుస్తుందని బిజెపి ప్రతినిధి డానిష్ అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు.

అయితే కొంతమంది అభిప్రాయం ప్రకారం "పస్మాందా సమాజం ఇప్పటికీ బిజెపికి అందుబాటులో లేదు. మాబ్ లించింగ్‌కు హింసకు గురైన వారిలో ఎక్కువ మంది పస్మాందాలు" అని అంటున్నారు. మాబ్ లించింగ్ ఘటనలకు పాల్పడిన చాలా మంది నేరస్థులు ముఖ్యంగా బిజెపి వర్గాల నుండి రాజకీయ రక్షణ లేదా సానుభూతిని పొందుతున్నారని విస్తృతంగా నమ్ముతారు.

బిజెపి వ్యతిరేకుల అభిప్రాయం ప్రకారం DBT వంటి సంక్షేమ పథకాలు సంవత్సరాలుగా ఉన్నాయి. పస్మాందాను లక్ష్యంగా చేసుకుని బిజెపి కొత్తగా చేసిందేమీ లేదు. 'సౌగత్-ఎ-మోడీ' పథకం కూడా లోపభూయిష్టంగా ఉంది

BJP పార్టీకి బిహార్ అసెంబ్లీలో ఒక్క ముస్లిం MLA కూడా లేకపోవడం గమనార్హం. రాష్ట్రంలోని NDA ప్రభుత్వంలో ఒకే ఒక ముస్లిం మంత్రి ఉన్నారు - జమాన్ ఖాన్ (మైనారిటీ సంక్షేమ శాఖ) - ఆయన మొదట BSP టికెట్‌పై తన స్థానాన్ని గెలుచుకుని తరువాత JD(U)లో చేరారు.

BJP తన పస్మాందా ప్రచారానికి నిజంగా కట్టుబడి ఉంటే, పస్మాందా సమాజానికి అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలను రిజర్వ్ చేయాలి."

హిందీ దినపత్రిక ప్రభాత్ ఖబర్ రాష్ట్ర సంపాదకుడు అజయ్ కుమార్, బిజెపి నాయకత్వం వద్ద పస్మాందా వర్గాలకు స్థిరమైన మరియు దీర్ఘకాలిక ప్రణాళిక లేదని భావిస్తున్నారు. ***(టు సర్కిల్స్ సౌజన్యంతో)***



# డాక్టర్ షౌకతుల్లాహ్ షాహ్ అన్సారి (1908 -1972)




88

జాతీయోద్యమకారుల సన్నిహిత సహచర్యంలో బాల్యం గడిపిన డాక్టర్ షౌకతుల్లా షాహ్ అన్సారి ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మిర్జాపూర్‌లో విద్యావంతుల కుటుంబంలో 16 జూన్, 1908లో జన్మించారు. తండ్రి అహ్మదుల్లా షాహ్ జిల్లా న్యాయమూర్తి. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు డాక్టర్ ముక్తార్ అహ్మద్ అన్సారి ఆయనను దత్తత తీసుకున్నారు. డాక్టర్ షౌకతుల్లాహ్ విద్యాభ్యాసం స్విట్జర్లాండ్‌లోని జెనీవా ఉన్నత పాఠశాలలో సాగింది. అనంతరం ప్యారిస్‌లో వైద్య శాస్త్రంలో పట్టా పొందిన డాక్టర్ షౌకతుల్లా ఇండియా వచ్చి ఢిల్లీలో వైద్యవృత్తిని చేపట్టారు. దత్తతండ్రి డాక్టర్ యం.ఏ అన్సారి గృహం 'దార్–ఉస్–సలాం' (Dar-us-Salam) జాతీయోద్యమంలో పాల్గొంటున్న మహా మహుల నుండి సామాన్య కార్యకర్తలతో పాటుగా ఆధ్యాత్మిక పండితులకు, వివిధ రంగాలలో సుప్రసిద్ధులైన ప్రముఖులకు వసతి గృహంగా సౌకర్యాలు కల్పించింది. ఆ వాతావరణంలో పెరిగిన డాక్టర్ షౌకతుల్లా చిన్ననాటి నుండి ఆంగ్లేయ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగిన సభలు సమావేశాల్లో పాల్గొంటూ జాతీయోద్యమకారులకు సేవలందించారు. జాతీయోద్యమ కార్యక్రమాలలో డాక్టర్ అన్సారికి సహకరిస్తూ వచ్చిన ఆయన, మహాత్ముడి పిలుపు మేరకు సహాయనిరాకరణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. 1926లో డాక్టర్ షౌకతుల్లా డాక్టర్ యం.ఏ అన్సారి దత్తపుత్రిక బేగం జొహరాను వివాహం చేసుకున్నారు. ఆ దంపతులిరువురూ బ్రిటిష్ ప్రభుత్వ వ్యతిరేక వాతావరణంలో పెరగడంతో జాతీయోద్యమ కార్యక్రమాలలో మరింత క్రియాశీలక పాత్ర నిర్వహించారు. భారత విభజన ఆలోచనలను చేస్తున్న ముస్లింలీగ్‌ను సైద్ధాంతికంగా ఎదుర్కొంటూ, ముస్లింలలో వేర్పాటువాద వ్యతిరేకతను ప్రోది చేయడానికి డాక్టర్ షౌకతుల్లా పలు సంస్థలను ఏర్పాటు చేసి నిర్వహించారు. 1944లో డాక్టర్ అన్సారి 'పాకిస్తాన్ ఎ ప్రాబ్లం ఆఫ్ ఇండియా' గ్రంథాన్ని వెలువరించారు. 1946 నాటి ఎన్నికలలో జాతీయ భావజాలం గల వ్యక్తుల విజయాన్ని ఆకాంక్షిస్తూ రంగంలోకి దిగారు. ముస్లింలీగ్‌ను ఎదుర్కొనడానికి నిధుల అవసరం ఏర్పడింది. అపార దాతృత్వగుణం వలన కుటుంబ అస్తులు కరిగిపోగా, డాక్టర్ యంఏ అన్సారి నివాస గృహం 'దార్–ఉస్–సలాం'ను విక్రయించి ఎన్నికలలో పోటీ చేస్తున్న జాతీయ కాంగ్రెస్ అభ్యర్థులకు నిధులు సమకూర్చారు. స్వాతంత్ర్యం సిద్ధించాక 1952లో జరిగిన ప్రథమ లోక్‌సభ ఎన్నికల్లో బీదర్ నియోజక వర్గం నుండి విజయం సాధించారు. 1957లో జరిగిన ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం రస్రా (Rasra) నుండి పోటీ చేసిన ఆయన పరాజితులయ్యారు. ఆ తరువాత భారత ప్రభుత్వంలో పలు అత్యున్నత పదవులు నిర్వహించారు. 1968 నుండి 1971 వరకు ఒరిస్సా గవర్నరుగా పని చేసిన డాక్టర్ షౌకతుల్లా షాహ్ అన్సారి డిసెంబర్ 26 1972లో తనువు చాలించారు. ✤



**9440241727**

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త **సయ్యద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ **'చరితార్థులు' - 2 (తెలుగు)** THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం

# నా కొడుకు ఎక్కడ ఉన్నాడు?

## - 9 ఏండ్ల క్రితం నాటి కేసు మూసివేతకు కోర్టు అంగీకారం

## - అదృశ్యమైన కొడుకు కోసం ఓ తల్లి న్యాయ పోరాటం




**న్యూఢిల్లీ**లోని ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన విశ్వవిద్యాలయంలో చదువుతున్న విద్యార్థి నజీబ్ 9 సంవత్సరాల క్రితం అదృశ్యమయ్యాడు. ఇప్పటికీ అతడి జాడ కనిపించ లేదు. నజీబ్ ఎక్కడ ఉన్నాడు? అనే ప్రశ్నకు సమాధానం లభించక అతడి తల్లి మౌనంగా బాధ పడుతుండగా, అతడి కేసు ముగించమని ఢిల్లీ పోలీసులు, సీబీఐ కోర్టును కోరాయి. చివరికి ఢిల్లీ లోని రౌజ్ అవెన్యూ కోర్టు సీబీఐ దాఖలు చేసిన క్లోజర్ నివేదికను అంగీకరిస్తూ కేసు మూసివేసేందుకు అనుమతి ఇచ్చింది.

సీబీఐ 2018లో తన క్లోజర్ రిపోర్టు దాఖలు చేసింది. అందులో తాము నజీబ్ కోసం వెతగ్గా స్పష్టమైన ఆధారం ఒక్కటీ లభించలేదని పేర్కొంది. కోర్టు ఈ నివేదికను అంగీకరించింది. కోర్టు ఈ కేసు మూసివేతకు అనుమతించడంపై నజీబ్ తల్లి ఫాతిమా నఫీస్ తీవ్రంగా స్పందించారు. సీబీఐ, ఢిల్లీ పోలీసులు ఈ కేసు దర్యాప్తులో నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు. "న్యాయం కోసం అవసరమైతే నేను సుప్రీం కోర్టుకు వెళ్లడానికైనా వెనకాడను" అని ఆమె తెలిపారు. "నా కుమారుడికి న్యాయం జరిగే వరకు, నా చివరి శ్వాస వరకు పోరాడుతాను" అని స్పష్టం చేశారు.

"నా కుమారుడు 9 సంవత్సరాలుగా కనిపించడం లేదు. మొదటి రోజు నుంచే ఢిల్లీ పోలీసులు, సీబీఐ ఈ కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించాయి. కానీ కోర్టు మాత్రం దర్యాప్తుకు తగిన ఆధారాలు లేవన్న సీబీఐ వాదనను అంగీకరిస్తూ కేసును మూసి వేసేందుకు అంగీకరించింది. ఈ రోజు వరకూ నా కుమారుడిపై దాడి చేసిన ABVP విద్యార్థులను అరెస్ట్ చేయలేదు. వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

"నా కుమారుడి గురించి ఎన్నో పుకార్లు, అబద్ధాలు వ్యాపించాయి. ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు ఆ వీడియోలను, కథనాలను డిజిటల్, సోషల్ మీడియాలో నుండి తొలగించారు. కానీ వాస్తవం ఏమిటంటే, ఇంతటి పెద్ద పెద్ద దర్యాప్తు సంస్థలు, న్యాయ వ్యవస్థ కూడా నజీబ్ ఎక్కడ ఉన్నాడో ఇప్పటివరకు చెప్పలేకపోయాయి" అని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.

"ఈ తొమ్మిదేండ్లలో వ్యవస్థ మమ్మల్ని మౌనంగా ఉండేలా చేయాలని చూసినప్పుడు, JNU, AMU, జామియా యూనివర్సిటీలతో పాటు దేశంలోని పలు కళాశాలల విద్యార్థులు నాతో కలిసి నిలబడ్డారు. వాళ్లే రోడ్డులపై లాఠీఛార్జీలను ఎదుర్కొన్నారు, నా తరపున గళమెత్తారు. ఇదే నాకు ధైర్యం ఇచ్చింది" అని ఆమె అన్నారు.

"ఇంత మంది తోడుగా ఉన్నప్పుడు నేను ఎందుకు నా ఆశ విడిచి పెడతాను? నేను ఎలా బలహీన పడతాను? నాకు నా కొడుకు తిరిగి కావాలి. న్యాయం కోసం నేను ఏ కోర్టులో అయినా పోరాడతాను. నా చివరి శ్వాస వరకు పోరాడుతాను" అని ఆమె అన్నారు.

"ఈ పోరాటంలో రాబోయే రోజుల్లో మరింత మంది నాతో చేరతారని నాకు ఆశ ఉంది. ఈ పోరాటం కేవలం నా కుమారుడి కోసం కాదు, తన బిడ్డకు న్యాయం కోరే ప్రతి తల్లి కోసం కూడా. అవసరమైతే నేను సుప్రీం కోర్టుకు వెళ్తాను" అని నజీబ్ తల్లి ఫాతిమా నఫీస్ ప్రకటించారు.

### 2016లో ఏం జరిగింది?

ఫాతిమా నఫీస్ చెప్పిన ప్రకారం, ఆమె కుమారుడు సెమిస్టర్ సెలవుల తర్వాత 2016 అక్టోబర్ 13న JNUకి తిరిగి వచ్చాడు. అక్టోబర్ 15 రాత్రి అతను తన తల్లి ఫాతిమాకు ఫోన్ చేసి, "ఇక్కడ అంతా గందరగోళంగా ఉంది" అని చెప్పాడు. హాస్టల్లోనే ఉండమని.. తాను అక్కడికి వస్తానని ఆమె కొడుక్కి ధైర్యం చెప్పారు. పోలీస్ ఫిర్యాదులో ఆమె పేర్కొన్నదాని ప్రకారం, నజీబ్ రూమ్మేట్ ఖాసిమ్ చెప్పిన దాని ప్రకారం... నజీబ్‌పై కొందరు దాడి చేయడంతో అతను గాయపడ్డాడు. కొడుకు కోసం నఫీస్ ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్ నుండి ఢిల్లీకి వచ్చారు. కానీ ఆమె మహీ మాండవి హాస్టల్‌లోని రూమ్ నెం.106కు వెళ్లినప్పుడు నజీబ్ అక్కడ కనిపించలేదు. అప్పటి నుండి అతను అదృశ్యమయ్యాడు. అప్పటి నుండి ఇప్పటి వరకూ నజీబ్ కోసం ఆ తల్లి నిరీక్షిస్తూనే ఉంది.

**('దావత్' సౌజన్యంతో...)**

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

35 ఆయత్‌లు

# 46. అల్ అహ్కాఫ్

మక్కా అవతరణ

15 మేము మానవునికి హితవు గరిపాము, తన తల్లిదండ్రుల ఎడల సౌజన్యంతో వ్యవహరించమని. అతని తల్లి శ్రమ తీసుకుని అతన్ని కడుపులో మోసింది, మరెంతో శ్రమతోనే అతనికి జన్మనిచ్చింది. అతని గర్భధారణకు, పాలు విడిపించడానికి ముప్ఫయి నెలలు పట్టాయి.[19] కడకు అతను పూర్తిగా బలాఢ్యుడయి నలభయ్యేళ్ల వాడయ్యేసరికి అతను అంటాడు, "నా ప్రభూ, నాకు సద్బుద్ధిని ప్రసాదించు–నీవు నాకూ, నా తల్లి దండ్రులకూ అనుగ్రహించిన మహా భాగ్యాలకుగాను నేను నీకు కృతజ్ఞతలు తెలుపుకునేందుకు, నీవు ప్రసన్నుడవయ్యే సత్కార్యాలు చేసే బుద్ధినీ అనుగ్రహించు[20] నా సంతానానికీ సదాచార పరాయణులుగా చేసి నాకు ఆనందం కలగజెయ్యి. నేను నీ సన్నిధిలో తౌబా చేస్తున్నాను, నేను ఆజ్ఞల్ని పాలించే(ముస్లిమ్) దాసుల్లోనివాడను."

19. ఈ ఆయత్ ఒక విషయాన్ని సూచిస్తోంది. సంతానం తల్లీ తండ్రీ ఉభయుల సేవ చేయవలసిందే. కాని తల్లి హక్కు దాని ప్రాముఖ్యత రీత్యా అధికమయింది. కారణం ఆమె సంతానం కొరకు అధికంగా కష్టాలను భరిస్తుంది. ఇదే విషయం ఒక హదీసు లోనూ ఉంది. అది కొన్ని పదాల వ్యత్యాసంతో బుఖారీ, ముస్లిమ్, అబూదావూద్, తిర్మిజి, ఇబ్నుమాజ, ముస్నద్ అహ్మద్, ఇమామ్ బుఖారీ గ్రంథం అల్ అదబుల్ మఫ్రద్‌లోనూ వచ్చింది. దాని ప్రకారం ఒక వ్యక్తి ప్రవక్త(శ్రీ (స)ని అడిగాడు, ఎవరి సేవచేసే హక్కు నాపైన అధికంగా విధితమవుతుంది? అని. ఆయన చెప్పారు, నీ తల్లిదని. అతను మళ్ళీ అడిగాడు, ఆ తరువాతనో అని. నీ తల్లి అనే చెప్పారు. ఆ తరువాత ఎవరు అని అతను మళ్ళీ అడిగాడు, నీ తల్లి అనే సమాధానమిచ్చారు ఆయన. మళ్ళీ, ఆ తరువాత ఎవరూ అని అడగ్గా నీ తండ్రి అని బదులిచ్చారాయన. ప్రవక్త(శ్రీ (స) సెలవిచ్చిన ఈ విషయం సరిగ్గా ఈ ఆయత్‌ని ప్రతిబింబిస్తుంది. ఇందులోనూ తల్లి హక్కును గురించి ముమ్మారు సూచించడం జరిగింది: (1) అతని తల్లి అతన్ని కష్టాలు భరించి కడుపున మోసింది. (2) కష్టం భరించే అతన్ని కన్నది. (3) అతని గర్భధారణలోనూ, పాలు పట్టడంలోనూ 30 నెలలు గడిచాయి.

ఈ ఆయత్, లుక్మాన్ సూరాలోని 14వ ఆయత్, బకర సూరాలోని 233వ ఆయత్ ద్వారా మరో చట్టపరమయిన అంశమూ వెలికి వస్తుంది. దాన్ని ఒక కేసు సందర్భంలో హజ్రత్ అలీ (ర), హజ్రత్ ఇబ్ను అబ్బాస్ (ర) సూచించగా హజ్రత్ ఉస్మాన్ (ర) దీని కారణంగా తన తీర్పును మార్చివేశారు. జరిగిందేమిటంటే, మహనీయ ఉస్మాన్ (ర) పాలనా కాలంలో ఒక వ్యక్తి జుహైనా తెగకు చెందిన ఒక స్త్రీని పెళ్ళాడాడు. పెళ్ళి జరిగిన ఆరు నెలలకే ఆమె ఒక సంపూర్ణ ఆరోగ్యవంతుడయిన శిశువుకు జన్మనిచ్చింది. ఆ వ్యక్తి మహనీయ ఉస్మాన్ (ర) సమక్షంలో వ్యవహారాన్ని ముందుంచాడు. ఆయన(ర) ఆ స్త్రీని వ్యభిచారిణిగా పరిగణించారు. ఆమెకు రాళ్ళు రువ్వి చంపే శిక్ష విధించారు. హజ్రత్ అలీ (ర) ఈ గాథ వినగానే వెంటనే హజ్రత్ ఉస్మాన్ (ర) వద్దకు వెళ్ళి మీరేమి ఇలా తీర్పు చేశారు అని అడిగారు. ఆయన, నికాహ్ జరిగిన ఆరు నెలలకు ఆమె పూర్ణ సజీవుడు, ఆరోగ్యవంతుడయిన శిశువును కన్నది, ఇది ఆవిడ వ్యభిచారిణి అనడానికి స్పష్టమయిన నిదర్శనం కాదా అని అడిగారు. దానికి హజ్రత్ అలీ, కాదు అని పలికి దివ్యఖుర్ఆన్‌లోని పై మూడు ఆయత్‌లు వరుసగా పఠించారు. బకర సూరాలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు, "తండ్రులు తమ సంతానం పాలుపట్టే గడువు పూర్తయ్యే వరకు పాలు త్రాగాలని కోరుకున్నట్లయితే, తల్లులు తమ సంతానానికి రెండు సంవత్సరాలు నిండే వరకు పాలు పట్టాలి" (ఆయత్: 233). లుక్మాన్ సూరాలో ఇలా ఉంది, "అతను పాలు విడువడానికి రెండేళ్లు పట్టాయి" (ఆయత్: 14). మరి అహ్కాఫ్ సూరాలో "అతని గర్భధారణకు, పాలు విడిపించటానికి 30 నెలలు పట్టాయి" (ఆయత్:15) అని ఉంది. ఇక 30 నెలల్లో నుంచి పాలు త్రాగే రెండేళ్ళు తీసివేస్తే గర్భధారణ కాలం ఆరు నెలలు మిగులుతాయి. దీన్నిబట్టి గర్భధారణకు కనీస వ్యవధి, సజీవుడు, ఆరోగ్యవంతుడయిన శిశువు జన్మించడానికి ఆరు నెలలని తెలుస్తోంది. కనుక నికాహ్ జరిగిన ఆరు నెలలకు శిశువును కన్న స్త్రీని వ్యభిచారిణి అనడానికి వీలులేదు. హజ్రత్ అలీ చేసిన ఈ వాదన విని హజ్రత్ ఉస్మాన్ (ర) 'ఈ మాట నాకు అసలు తట్టలేదు' అని అన్నారు. తరువాత ఆ స్త్రీని పిలిపించి తన తీర్పును మార్చివేశారు. ఒక ఉల్లేఖనం ప్రకారం, హజ్రత్ అలీ(ర) వాదనను హజ్రత్ ఇబ్ను అబ్బాస్ (ర) బలపరిచారని కూడా ఉంది. ఆ తరువాత హజ్రత్ ఉస్మాన్ తన తీర్పును మార్చుకున్నారని ఉంది. *(ఇబ్ను జరీర్, 'జస్సాస్' రచించిన 'అహ్కాముల్ ఖుర్ఆన్' – ఇబ్ను కసీర్).*

**19వ పాదసూచిక మిగతా వచ్చే సంచికలో)**

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (6వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ الْمَغَازِي

## 4. యుద్ధాల ప్రకరణం -2
(కితాబుల్ మగాజీ)

# ప్రవక్త మహనీయులు (సఅసమ్) అస్వస్థతకు గురైన రోజుల్లో...

**304)** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) ఇలా వివరించారు : సోమవారం నాడు ఉదయం జనులు అబూబక్ర్(రజి) సారథ్యంలో నమాజ్ చేస్తున్నారు. అంతలోనే ఆయన ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఎందుకంటే ఆ క్షణంలో దైవప్రవక్త(స) ఆయిషా(ర.అ) కుటీరంలో నుండి తెర ఎత్తారు. ముస్లింలు వరుసలు తీరి నమాజులో నిలబడి ఉండటం గమనించారు. ఈ దృశ్యాన్ని చూసి ఆయన(స) చిరునవ్వు చిందించి, ఆ తర్వాత నవ్వేశారు (అంటే ముస్లింలు నమాజ్‌ను స్థాపించిన దృశ్యాన్ని తిలకించి ఆయన ఆనందాతిశయంతో ఉప్పొంగిపోయారు). ఈ పరిస్థితిని పసిగట్టిన అబూబక్ర్(రజి) దైవప్రవక్త(స) ఏతెంచనున్నారని తలపోసి వెనక్కి జరగబోయారు. అనస్(రజి) ఇలా అన్నారు: ఆ క్షణంలో ప్రవక్త మహోదయులు(స)ను చూసిన ముస్లింలకు కలిగిన సంతోషం అంతా ఇంతా కాదు. వారు ఆ తన్మయత్వంలో నమాజ్‌ను కూడా భగ్నపరిచేలా కనిపించారు. కాని ఆయన(స), "నమాజ్‌ను పూర్తి చేయండి" అంటూ చేత్తో సంజ్ఞ చేశారు. తరువాత దైవప్రవక్త(స) కుటీరంలోనికి వెళుతూ తెర దించేశారు.[1]

**305)** హజ్రత్ ఆయిషా(ర.అ) ఇలా అనేవారు: అల్లాహ్ నాకు చేసిన ఎన్నో మేళ్ళలో ఒక మేలు ఏమిటంటే, ప్రవక్త మహనీయులు(సఅసమ్) నా వంతు రోజునే నా ఇంట్లో పరమపదించారు. మరణ సమయంలో ఆయన(స) శిరస్సు నా ఎదకు– నా చుబుకానికి మధ్యన ఉంది. మరణ ఘడియలో అల్లాహ్ ఆయన(స) లాలా జలాన్ని నా లాలాజలంతో కలిపాడు. ఇంతకీ జరిగిందేమిటంటే, ఆ సమయంలో అబ్దుర్రహ్మాన్ బిన్ అబీబకర్ అక్కడికి వచ్చాడు. అతని చేతిలో మిస్వాక్ (పనుదోము పుల్ల) ఉంది. నేను ఆయన(స) దేహానికి నా శరీరాన్ని ఊతగా ఆనించి ఉన్నాను. ఆయన (స) మిస్వాక్‌ను తదేకంగా తిలకించటం నేను పసిగట్టాను. మిస్వాక్ చేయటం ఆయనకు ఎంత ఇష్టమో నాకు తెలుసు. అందుకే 'ఆ మిస్వాక్‌ను మీ కోసం తీసుకోనా?' అని అడిగాను. "అవున"న్నట్లు సంజ్ఞ చేశారాయన. నేను మిస్వాక్‌ను (అబ్దుర్రహ్మాన్ నుండి) తీసుకుని ఆయన(స)కు ఇచ్చాను. ఆయన(స) వ్యాధి తీవ్రత కారణంగా మిస్వాక్ పుల్లను నమలలేని స్థితిలో ఉన్నారు. 'నేను ఈ పుల్లను మెత్తబరచి ఇవ్వనా?' అని అడిగాను. ఆయన(స) 'అవున'నంటూ తలూపారు. నేను ఆ మిస్వాక్ పుల్లను నమలి ఆయనకు అందించాను. దైవ ప్రవక్త(స) మిస్వాక్ చేశారు. తరువాత ఆయన(స) ముందు నీళ్ళ చెంబు ఉంచబడింది. ఆయన తన రెండు చేతులను నీళ్ళలో ముంచి ముఖంపై త్రిప్పుకుంటూ **"లా ఇలాహ ఇల్లల్లాహ్–** మరణ వేదన కూడా ఎంతో కఠినమైనది" అని పలికారు. ఆ తర్వాత, "ఓ అల్లాహ్! నన్ను ఉన్నత మిత్రులలో చేర్చు" అని వేడుకున్నారు. అంతే, ఆయన (స) పవిత్ర ఆత్మ నింగికేగింది. ఆయన(స) చేయి నేల కొరిగింది.

*304-1. ఆ రోజే ఆయన(స) పరమపదించారని వేరొక ఉల్లేఖనంలో ఉంది.*

# శుభస్య శీఘ్రం

- సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ

**విశ్వాసులారా! మీ సంతానం, సిరిసంపదలు మిమ్మల్ని దైవధ్యానం నుండి మరపింపజేయకూడదు. అలా చేసేవారే నష్టపోయేవారు. మేము ప్రసాదించిన ఉపాధి నుండి (మా మార్గంలో) ఖర్చుపెట్టండి. మీలో ఎవరికైనా మరణ సమయం ఆసన్నమయి "ప్రభూ! నాకు మరికొంత గడువియ్యలేదే? ఇస్తే నేను దానధర్మాలు చేసి సజ్జనుల్లో చేరిపోతాను కదా?" అని అతను అనవచ్చు. అలాంటి దుస్థితి దాపురించక ముందే ఈ సత్కార్యం చేయండి. ఎవరికైనా ఆచరణ గడువు ముగిసే సమయం వస్తే, ఇక అతనికి దేవుడు ఏమాత్రం అవకాశం ఇవ్వడు. మీరు చేసేదంతా దేవునికి తెలుసు.**

**(అల్-మునాఫిఖూన్: 9-11)**

ఏదైనా గడిచిపోయిన, జరిగిపోయిన, జారిపోయిన, కోల్పోయిన తరువాత ఏమనుకున్నా, ఏం చేసినా, ఎంత బాధపడినా ప్రయోజనం ఉండదు. ఇలాంటి పరిస్థితినే 'చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం' అంటారు. అలాంటి పరిస్థితిలో పరిష్కారం కోసం వెతికేకన్నా ముందు జాగ్రత్తలు తీసుకోవడం మంచిది.

డబ్బో వస్తువో కోల్పోతే ఏదోలా సంపాదించుకోగలం. కానీ 'గయా కల్ ఫిర్ ఆతా నహీ'- మహత్తర సమయాన్ని కోల్పోతే దాన్ని తిరిగి సంపాదించుకోవడం దాదాపు అసాధ్యం. ఏదైనా అవకాశం జీవితంలో ఒక్కసారే వస్తుంది. మరో మారు వస్తుందో లేదో మనలో ఎవరికీ తెలీదు.

రేపు తాను ఏం చేయనున్నాడో ఏ మనిషికీ తెలియదు. అలాగే తనకు ఏ భూభాగంలో మృత్యువు కాటువేస్తుందో కూడా ఎవరికీ తెలియదు. సమస్త విషయాలు దేవునికి మాత్రమే తెలుసు. ఆయన సర్వజ్ఞాని, సమస్తం ఎరిగినవాడు. (లుఖ్మాన్: 34)

అంది వచ్చిన అవకాశాన్ని ఒడిసి పట్టుకుని పైకెదగాలి. ఆ అవకాశం తప్పిపోయిన తరువాత దాని గురించి ఎంత వగచినా, ప్రయోజనం ఉండదు. ఆ అవకాశం వచ్చినప్పుడు తెగువ, చొరవ లాంటి లక్షణాలు ప్రదర్శించి సద్వినియోగం చేసుకోవాలి. కాలం ఎవరి కోసమూ ఆగదు. దాంతోపాటే మనమూ పయనిస్తూ వచ్చే మార్పులకు అనుగుణంగా నడచుకుంటేనే దాన్ని సద్వినియోగం చేసుకోగలం. ప్రవాహం వచ్చి, చేయాల్సిన నష్టం అంతా చేసి వెళ్లిపోయాక వంతెన కట్టడం వల్ల ప్రయోజనం శూన్యం. దీన్నే 'గతజల సేతు బంధనం' అంటారు. అలాంటి పరిస్థితి కలగకుండా ముందుగానే జాగ్రత్తలు, తగిన చర్యలు తీసుకోవాలనే బోధన ఉందీ నానుడిలో.

ఏదైనా మంచి పని మొదలు పెట్టాలనిపిస్తే రేపు-మాపు అని వాయిదా వేయకుండా వెంటనే ప్రారంభించమని చెబుతుంది 'శుభస్య శీఘ్రం' అనేమాట. ఏ వయసులో జరగాల్సిన ముచ్చట ఆ వయసులో జరగాలన్నది మరొకటి. చదువుకునే వయసులో చదువు, తగిన వయసులో వివాహం.... ఇలా ఎప్పుడు జరగాల్సింది అప్పుడు జరిగితేనే అందం.. ఆనందం.

విశ్వాసులారా! మీరు అల్లాహ్‌కు సహాయం చేస్తే ఆయన మీకు సహాయం చేస్తాడు. మీ కాళ్ళను స్థిరంగా ఉంచుతాడు.

(ముహమ్మద్:7)

ధర్మాన్ని మనం రక్షిస్తే  ధర్మం మనల్ని కాపాడుతుందన్నది అనాదిగా చెబుతున్న మాట. ధర్మం వల్లనే మనిషికి ఉత్తమ గతులు లభిస్తున్నాయని ఖుర్ఆన్, హదీసులు పేర్కొంటున్నాయి.. పరులకు కష్టం, నష్టం వాటిల్లకుండా, అల్లాహ్ వద్ద  పుణ్య ఫలాపేక్షతో  సత్యమార్గంలో కర్మను ఆచరించడమే ధర్మం. దీనివల్లే మనిషికి శాంతి, సౌఖ్యము, ముక్తి మార్గాలు చేరువవు తాయి. ధర్మాన్ని  ఆచరించేవారన్నా, ఉపదేశించేవారన్నా, ప్రోత్సహించేవారన్నా అల్లాహ్‌కు  బహు ప్రీతి. మీరెక్కడున్నా ఆయన మీ వెన్నంటే ఉంటాడు. మీరు చేసే ప్రతి పనీ ఆయన చూస్తు న్నాడు. ఆయనే విశ్వాసుల్ని  కాపాడతాడు. ధర్మాత్ముల ప్రార్థన లను వింటాడు. ధర్మం నాలుగు పాదాల నడయాడే లోకాలకు, లోకులకు  మేలు చేస్తాడు.

**ధర్మాన్ని మనం రక్షిస్తే  ధర్మం మనల్ని కాపాడు తుందన్నది అనాదిగా చెబుతున్న మాట. ధర్మం వల్లనే మనిషికి ఉత్తమ గతులు లభిస్తున్నాయని ఖుర్ఆన్, హదీసులు  పేర్కొంటున్నాయి.. పరులకు కష్టం, నష్టం వాటిల్లకుండా, అల్లాహ్ వద్ద  పుణ్య ఫలాపేక్షతో  సత్యమార్గంలో కర్మను ఆచరించడమే ధర్మం. దీనివల్లే మనిషికి శాంతి, సౌఖ్యము, ముక్తి మార్గాలు చేరువవు తాయి. ధర్మాన్ని  ఆచరించేవారన్నా, ఉపదేశించే వారన్నా, ప్రోత్సహించేవారన్నా అల్లాహ్‌కు బహు ప్రీతి.**

### ఈ సందర్భంగా మనం నెత్తురోడుతున్న గాజాను మరచి పోకూడదు.

చుట్టూ శిథిలాలు.... అంతటా మృతదేహాలు... ధ్వంసం కాగా మిగిలిన ఆసుపత్రుల నేల మీద  నెత్తుటి మడుగుల్లో మనుషులు... వాళ్లను కాపాడాలని కన్నీళ్లతో ప్రయాస పడుతున్న డాక్టర్లు... ఆపత్కాలంలో అందుబాటులో లేని అత్యవసర ఔషధాలు... కనీస వైద్య వసతులకూ దిక్కులేని దయనీయ పరిస్థితులు- ప్రస్తుతం గాజాలో కనిపిస్తున్న ఈ హృదయవిదారక దృశ్యాలు అక్కడి మానవతా సంక్షోభాన్ని కళ్లకు కడుతున్నాయి. ఇస్రాయీల్, హమాస్‌ల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం పశ్చిమాసియాను స్థిమిత పరచగలదన్న ఆశలన్నీ అడియాసలయ్యాయి. మొన్న మంగళవారం గాజాలోని ఎనభై ప్రదేశాలపై ఇస్రాయీల్ చేసిన వైమానిక దాడుల్లో నాలుగొంద లకు పైగా ప్రాణదీపాలు కొండెక్కిపోయాయి. ఆహార పదార్థాలు, తాగునీరు, నిత్యావసరాలు, మందులు, విద్యుత్ సరఫరాలను ఇస్రాయీల్ స్తంభింపజేయడంతో ఇరవై లక్షల మంది గాజా వాసులు ఇప్పటికే నరకం చవి చూస్తున్నారు. అలాంటి అసహాయ వాతావరణంలో శరణార్థి శిబిరాలు, పాఠశాలలు వంటివాటిపై విరుచుకుపడిన  కల్లోల జనకులుగా అపఖ్యాతికెక్కిన యూదు రాబందువులు తమ రాక్షసత్వాన్ని మరోసారి ప్రదర్శించాయి. తమకు చెప్పాకే ఇస్రాయీల్ గాజాపై దాడి చేసిందన్న వైట్‌హౌస్ వర్గాల ప్రకటన- హింసోన్మాద యూదు మూకలకు వెన్నుదన్నుగా ఉంటోంది ఎవరో స్పష్టంగా వెల్లడిస్తోంది! స్వప్రయోజనాల కోసం స్వార్థ రాజకీయ నాయకుడు ఆడుతున్న మృత్యుక్రీడ-మానవ నాగరికతకే మాయనిమచ్చ! ఈ అమానవీయ, దయనీయ ఘట్టాన్ని ఎవరు గుర్తు పెట్టుకున్నా, పెట్టుకోకపోయినా చరిత్ర మాత్రం తప్పకుండా  తన పుటల్లో భద్రపరచుకుంటుంది.

ఇదే సమయంలో- స్వదేశీయ స్థితిగతుల్ని కూడా కాస్త  నెమరు వేసుకోవాలి...! చీమలకు చక్కెర పాములకు పాలోసి... జీవకారుణ్యమే జీవితం అనే మనుషులే... తోడ పుట్టిన వాళ్ళను ఊరవతలకి నెట్టి.. కులమంటూ, మతమంటూ, కలహాల గిరి గీసి.. కోటి విద్యలు కూటి కోసమన్నది పోయి, కోట్లకు పడగెత్తి కోరికలు చెలరేగి మాయమై పోతున్నాడు మనిషన్నవాడు.. మచ్చుకైనా లేడు చూడు మానవత్వం వున్నవాడు. ఒకటి విధ్వంసక మతమని, ఇంకొకటి విద్వాంసుల మతమని మైకెక్కి చెబుతున్న కొందరు బురదబుద్ధి ప్రబుద్ధుల వల్ల, చరిత్రతో అసలు సంబంధమే లేని కొన్ని అసత్య  చిత్ర ప్రదర్శనల వల్ల ఉన్న ఆ కాసింత మానవత్వం మంటగలిసిపోతున్నది.

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల సౌపురాయి
గీటురాయి
వారపత్రిక

(భవిష్యత్తులో) మీరు ధనప్రాణాల విషయంలో అనేక కఠిన పరీక్షలకు గురికావలసి వస్తుంది. అదీగాక మీరు గ్రంథప్రజల నుండి, బహుదైవారాధకుల నుండి కూడా మనస్సు నొప్పించే మాటలు అనేకం వినవలసి వస్తుంది. కనుక అలాంటి స్థితిలో మీరు సహనం వహించి, భయభక్తులతో కూడిన జీవితం గడుపుతూ ధర్మమార్గంలో స్థిరంగా ఉండాలి. నిజంగా ఇది ఎంతో సాహసోపేతమైన కార్యం. (ఆలి ఇమ్రాన్: 186)

నిండైన నది నిశ్శబ్దంగా ప్రవహిస్తుంది. పిల్లకాలువలుగా చీలి గులకరాళ్ల మీద ప్రవహిస్తున్నప్పుడు గలగలమంటూ శబ్దాలు చేస్తుంది. నిండు కుండ తొణకదు. ఇలాంటి ఉపమానాలెన్ని చెప్పినా మాట్లాడటం మానడు మనిషి. భావ వ్యక్తీకరణకోసం అల్లాహ్ అతడికిచ్చిన మహత్తరమైన శక్తి- ఉక్తి అంటే మాట. సృష్టిలో మరే జీవికీ అది లేదు. అందుకే దాన్ని ఆచితూచి వాడాలి. మాట మనసులోంచి వచ్చినట్లుండాలి. మంచి మాట అనిపించాలి. అందరినీ ఆలోచింపజేయాలి! స్నేహం- వైరం, నిర్మలత్వం, కళంకం, పుణ్యం- పాపం, శాంతి- అశాంతి, మంచి- చెడు... అన్నీ మాటలనుబట్టే వస్తాయి. మాట మనసును నొప్పించనూ గలదు, ఒప్పించనూ గలదు. మన చేతలే కాదు, మాటలు కూడా ఇతరులకు బాధ కలిగించకూడదు. మహనీయ ముహమ్మద్(స) వారి మాట మనందరికీ ఆదర్శనీయం, ఆచరణీయం.

### మంచి సమయం మించి పోతోంది

పొద్దున్న లేద్దామనుకుంటాం కానీ లేవలేకపోతాం.. ఈ రోజు తప్పకుండా ఫలానా పని చేయాలనుకుంటాం.. కానీ రేపు చేసేద్దాం లే.. అనుకొని వెనుకడుగు వేస్తాం. ఇలా ఒకటో రెండో విషయాల్లో కాదు, రోజువారీ అనేక అంశాల్లో పనులను వాయిదా వేసే అలవాటు చాలా మందికి ఉంటుంది. ఈ విధంగా చేయడమంటే సమయాన్ని వృథా చేయడమే. ఒక విధంగా చెప్పాలంటే వాయిదాలు వేసే అలవాటు రోగంతో సమానం. అదే వాయిదాల వ్యాధి. అనేక సమస్యలకు అది కారణం అవుతుంది. నిజానికి ప్రతీ వందలో 90 మంది తమకు తెలియకుండానే వాయిదాలు వేస్తుంటారు. కానీ దీనివల్ల నష్టపోయే అవకాశాలే ఎక్కువ. ముఖ్యమైన పనులు, కీలకమైన నిర్ణయాల సందర్భంలోనూ రేపు, ఎల్లుండి అనుకుంటూ కూర్చుంటే పోటీ ప్రపంచంలో, పుణ్య కార్యాల్లో పోటీ పడాల్సిన ఈ సమయంలో విజయం సాధించడం కష్టం.

నిశ్చయంగా తలచుకుంటే .. నిరంతర కృషీవలురు. అయితే ప్రతి ఒక్కరూ ఒక సహాబీకి ప్రతిరూపంగా కాగలరు. ప్రతి ఒక్కరూ ఒక బిలాల్ (రజి) లా అవగలరు. ప్రతి మహిళా ఒక ఉమ్ముల్ మసాకీన్ - పేదల పెన్నిధి హజ్రత్ జైనబ్ (ర)లా అవ్వచ్చు. ప్రతి ఒక్కరూ ఒక సల్మాన్ ఫారసీలా కాగలరు. ప్రతి ఒక్కరూ ఒక సుహైబ్ రూమీలా కాగలరు. ప్రతి ఒక్కరూ ఒక అబ్దుల్లాహ్ బిన్ ఉమ్మె మక్తూమ్ (రజి)లా మారగలరు. ప్రతి ఒక్కరూ ఒక ఉవైస్‌కర్ణీలా జీవించగలరు. ప్రతి ఒక్కరూ ఒక ఖాలిద్ బిన్ వలీద్‌లా సాధించగలరు. ఎవరైనా ఒకరు ఒకానొక గొప్ప పని చేస్తే దాని అర్థం "మిగతా అందరూ కూడా ఆ పనిని చేయగలరు" అని ..దీనినే "ఉపమాన ప్రమాణం" అంటాం. ప్రతి ఒక్కరి దగ్గరా అన్ని శక్తులూ నిబిడీకృతంగా వున్నాయి .. అయితే, అవి ప్రకటితం కావడానికీ, యదార్థంగా రూపుదాల్చడానికీ కావలసినవి "ఆత్మ విశ్వాసం" .. "తీవ్రవాంఛ".. "లోక కల్యాణ ఆశయం"! అదీ మీ అందరికి ఉంది అని బలంగా నమ్ముతున్నాము. నాలో, మీలో మనందరిలో అలాంటి అకుంఠిత దీక్షను అల్లాహ్ కలుగ జేయాలని, మనల్ని అజేయులుగా, పశు


**చందాదారులకు విజ్ఞప్తి**

**చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.**

**వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి 9704317015**

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
Hyderabad- 500 002, Telangana

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**

**మనిషి తాను స్వేచ్ఛా జీవిననుకుంటాడు కానీ నిజానికి సంఘజీవి- కాబట్టి అతడు ఆ సంఘం కట్టుబాట్లను అనుసరించి జీవించాలి. అందుకే చాలా సందర్భాల్లో మనసును నియంత్రించుకోక తప్పదు. ఉద్యోగ విధులు నిర్వర్తిస్తున్నపుడు పై అధికారి ఆదేశాలు అమలు చేసి తీరాలి. ఇంటి విషయాల్లో ఇతర కుటుంబసభ్యుల సలహాలకు విలువనివ్వాలి. మిత్రులతో కలసి నడుస్తున్నప్పుడు వారి అభిప్రాయాలను గౌరవించాలి.**

పతులుగా తీర్చి దిద్దాలని దీనాతి దీనంగా వేడుకుంటున్నాను. అల్లాహ్ యెడల అచంచల విశ్వాసం, ఆత్మవిశ్వాసంతోపాటు "తీవ్ర వాంఛ" అన్నది కూడా ఎంతో ముఖ్యం - ఈ రెండూ జత కూడితే అసాధ్యాలన్నీ అతి సహజంగా సుసాధ్యాలు అవుతాయి. అల్లాహ్ ప్రసన్నతతో కూడిన "లోకకళ్యాణ ఆశయం" అన్నది కూడా కలిపితే జీవితం చరితార్థం అవుతుంది.

"అత్యాచారం ఏదో, "శిష్టాచారం" ఏదో .. మనమందరం విధిగా తెలుసుకోవాలి... ప్రాపంచిక విద్యలన్నింటి కన్నా మౌలికమైనది .. మరీ ముఖ్యమైనది .. "ఆధ్యాత్మిక విద్య". "ఆధ్యాత్మిక విద్య" నేర్పే తొలి పాఠం తౌహీద్ ద్వారానే భిన్న సంస్కృతుల ప్రజలు, భిన్న జాతుల ప్రజలు కలిసి మెలిసి సరియైన సంఘ-జీవితాన్ని అనుభవించగలుగుతారు. "ఆధ్యాత్మిక శాస్త్రం" అన్నదే ఆరోగ్య శాస్త్రానికి మూలం

"ఆధ్యాత్మిక జీవితం" అన్నదే ఆనంద జీవితానికి సోపానం. కాబట్టి .. శ్రేయోదాయకమైన కర్మలను, మంచి పనులను, సత్కార్యాలను చేసేందుకు త్వరపడాలి". పోటీపడేవారు దీన్ని సాధించడానికి పోటీపడాలి. (అల్-ముతఫ్ఫిఫీన్: 26)

చివరికి ప్రతి మనిషీ ఓ రోజు చావాల్సిందే. మీకర్మలకు ప్రళయ దినాన పూర్తి ప్రతిఫలం లభిస్తుంది. నరకానికి దూరంగా స్వర్గానికి పంపబడేవాడే నిజమైన కృతార్థుడు. ఐహిక జీవితం, (దాని సౌఖ్యాలు) ఒట్టి మోసపూరితమైన పైపై మెరుగులు మాత్రమే. (ఆలి ఇమ్రాన్: 184-185)

పుట్టిన ప్రతి ప్రాణికీ చావు తప్పదని తెలుసు. సంపద అస్థిరమని, ఆగ్రహం అనర్థ దాయకమని తెలుసు. ఏది మంచో ఏది చెడో తెలుసు. అన్నీ తెలిసినా ఏమీ తెలియనట్లు నటించడమూ తెలుసు. అదే మానవ నైజం. అన్నీ తెలుసనుకుంటున్న మనిషి తనను సృష్టించిన దైవానికి ఏమీ తెలియదనుకునేంత చావు తెలివి గలవాడు!.


మనిషి తాను స్వేచ్ఛా జీవిననుకుంటాడు కానీ నిజానికి సంఘజీవి- కాబట్టి అతడు ఆ సంఘం కట్టుబాట్లను అనుసరించి జీవించాలి. అందుకే చాలా సందర్భాల్లో మనసును నియంత్రించుకోక తప్పదు. ఉద్యోగ విధులు నిర్వర్తిస్తున్నపుడు పై అధికారి ఆదేశాలు అమలు చేసి తీరాలి. ఇంటి విషయాల్లో ఇతర కుటుంబ సభ్యుల సలహాలకు విలువనివ్వాలి. మిత్రులతో కలసి నడుస్తున్నప్పుడు వారి అభిప్రాయాలను గౌరవించాలి. తనకు నచ్చని విషయాన్ని సున్నితంగా తెలియజేయవచ్చు. కానీ వాదనలకు దిగితే వేదన మిగిలి మిత్రులు శత్రువులవుతారు. మనసును నియంత్రించుకోవడం మనిషికి అవసరం. అలా కాకుండా దాని నియంత్రణలోకి వెళ్లిన వ్యక్తి కష్టాలపాలవుతాడు. అందుకని ఖుర్ఆన్ ఇలా హితోపదేశం చేస్తుంది.

నిస్సందేహంగా ఆత్మప్రక్షాళన చేసుకున్నవాడు ధన్యుడు. అంతరాత్మను అణచిపెట్టినవాడు నాశనమవుతాడు. (అష్-షమ్స్:9-10) వచనం రీత్యా జ్ఞానబలంతో మనసును మంచి ఆలోచనలతో నింపుకొన్నవారు, అల్లాహ్ అనుగ్రహించిన అశాశ్వతమైన మానవ జీవితాన్ని సార్థకం చేసుకుని కీర్తిశేషులవుతారు. కాదు కూడదు అంటే అపకీర్తి మూటకట్టుకోక తప్పదు. భగభగమండే నరకాగ్నికి ఇంధనం కాక తప్పదు.

మతులను పోగొట్టే బీదరికం గురించి ఎదురు చూస్తున్నారా? లేదా మదమెక్కించే అధిక ధనం గురించి ఎదురు చూస్తున్నారా? ప్రాణాలన్నింటిని పాడు చేసే మహమ్మారి రోగం గురించి ఎదురు చూస్తున్నారా? ఎముకలుడిగి ఏమీ చేయలేని, ఏమి చేతకాని దయనీయ స్థాయికి నెట్టే ముసలితనం గురించి ఎదురు చూస్తున్నారా? ఎంతో ఇష్టంగా నిర్మించుకున్న ఆశల సౌధాల్ని ఒక్క కుదుపుతో నేలమట్టం చేసే మరణం గురించి ఎదురు చూస్తున్నారా? అగోచరంగా ఉన్న అతి భయంకర చెడు దజ్జాల్ ఉపద్రవం గురించి ఎదురు చూస్తున్నారా? లేదా ప్రళయం గురించి ఎదురు చూస్తున్నారా? మరి అందరి భరతం పట్టడానికి నిర్ణీతదినం ప్రళయం ఉండనే ఉంది.

అప్పుడు ఒక వర్గం స్వర్గానికి, మరొక వర్గం నరకానికి పోవలసి ఉంటుంది. (అష్-షూరా: 7)

ఏ విషయంలో ఎలా ఉన్నా, మంచి పనుల విషయంలో మాత్రం - ఆలస్యం అమృతం విషం!




**యండి. ఉస్మాన్ ఖాన్,**
**సీనియర్ జర్నలిస్టు**

**విద్య** అనేది కేవలం జ్ఞానం బోధించే వ్యవస్థ మాత్రమే కాదు, అది సమాజ నిర్మాణానికి బలమిచ్చే ప్రాథమిక హక్కు. రాజ్యాంగం ఇచ్చిన స్వతంత్రత, సమానత్వం లాంటి సమస్త హక్కులకూ ప్రాణం పోసేది విద్యే. కానీ ఇటీవలి కాలంలో ఈ రంగమే వివక్ష, వంచన, రాజకీయ ప్రభావాల వేదికగా మారుతోంది.

జాతీయ విద్యా విధానం- 2020 పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రణాళిక ఒకవైపు ఆధునికతను వాగ్దానం చేస్తూనే, మరోవైపు మైనారిటీ సమూహాలకు, ముఖ్యంగా ముస్లింలకు, విద్యార్జనా అవకాశాలను క్రమంగా కుదించి వేస్తోంది. ఇది విద్యా విధానంలో ఎంతమాత్రమూ సానుకూల మార్పు కాదు.

ప్రభుత్వం చెబుతున్న ప్రకారం 2020 విద్యా విధానం ద్వారా దేశ విద్యా వ్యవస్థను ఆధునికీకరించడమే లక్ష్యమట. కాని ఆచరణలో మాత్రం అలాంటి లక్షణాలేవీ కనిపిస్తున్న దాఖలాల్లేవు. ముస్లిం విద్యా సంస్థలపై నిబంధనల పేరుతో పరిమితులు విధించడం, మదర్సాలను గుర్తింపు చట్టాల నుంచి వేరు చేయడం, కొన్ని రాష్ట్రాల్లో మూసివేతకు పరోక్షంగా ఒత్తిడి తేవడం- ఇవన్నీ విద్యాపరమైన స్వతంత్రతకు వ్యతిరేక చర్యలే.

2020 విద్యా విధానంలో 'ప్రత్యామ్నాయ విద్యా విధానాలు' అనే విభాగంలో మదర్సాలకు తగిన ప్రాముఖ్యత లేకపోవడం దీనిపై అనిశ్చితిని పెంచుతోంది. ఉత్తరప్రదేశ్, అస్సాం వంటి రాష్ట్రాల్లో 2021 నుంచి 2023 మధ్యలో వందల కొద్ది మదర్సాలు గుర్తింపు కోల్పోవడం లేదా మూసివేయబడడం గమనార్హం. మదర్సాల పనితీరు పునఃసమీక్ష పేరుతో అనుమతులు నిలిపి వేయడం వల్ల, నిరాటంకంగా నడుస్తున్న మైనారిటీ విద్యాసంస్థలు ప్రభావితమవుతున్నాయి. ఇది చట్టాన్ని ఉల్లంఘించడమే కాకుండా, రాజ్యాంగ హామీలకు భంగం కలిగించే ప్రయత్నమే.

## కీలక మార్పులు

ఇటీవలి సంవత్సరాల్లో కేంద్ర ప్రభుత్వం మైనారిటీల కోసం అమలు చేస్తున్న ప్రీ-మాట్రిక్ స్కాలర్‌షిప్‌లో కీలక మార్పులు చేసింది. గతంలో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఉన్న ఈ స్కాలర్‌షిప్‌ను 2022-23 విద్యా సంవత్సరం నుంచి 9వ తరగతి నుంచే పరిమితం చేసింది. దీనివల్ల 1 నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న, ముఖ్యంగా దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తున్న ముస్లిం మైనారిటీ వర్గాల చిన్నపిల్లలు తీవ్రమైన ప్రభావానికి లోనవుతున్నారు. చదువు ప్రోత్సాహానికి ఆర్థిక భరోసా

కీలకంగా ఉండే వయస్సులోనే ఇలా వేతనసాయం లేకుండా పోవడం, వారి ప్రాథమిక విద్యా అవకాశాలను దూరం చేసే విధంగా మారింది.

దీంతో పాటు, ఉర్దూ మీడియం పాఠశాలల సంఖ్య కూడా గత దశాబ్ద కాలంలో గణనీయంగా తగ్గినట్లు పలు నివేదికలు వెల్లడించాయి. మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల్లో ఉర్దూ పాఠశాలల సంఖ్య వందల కొద్ది తగ్గినట్లు గణాంకాలు చూపిస్తున్నాయి. ఇది విద్యాసంపన్నతలో వెనుకబడి ఉన్న ముస్లిం సమాజానికి మరింత అన్యాయం చేసే మార్గంగా భావించవచ్చు. ఉర్దూ భాషకు అధికారిక, విద్యా వ్యవస్థలో ప్రాధాన్యం క్రమంగా తగ్గిపోవడం, ఆ భాషలో విద్యను పొందే అవకాశాలను కుదించటం ఆందోళన కలిగించే విషయం.

## విద్యా హక్కు చట్టం మినహాయింపు

రాజ్యాంగంలోని ఆర్టికల్ 30 ప్రకారం మైనారిటీలకు తాము నడిపే విద్యాసంస్థలకు స్వతంత్రత ఉంది. విద్యా హక్కు చట్టం కూడా మైనారిటీ విద్యా సంస్థలకు కొన్ని మినహాయింపులను కల్పించింది. అయితే 2020 విద్యా విధానం అమలులో ఈ స్వేచ్ఛకు గండిపడే పరిస్థితులు కనిపిస్తున్నాయి. గుర్తింపు కోసం విధిస్తున్న నిబంధనలు మదర్సాల లక్ష్యాలకు భిన్నంగా ఉండడంతో, అవి తమ విద్యా విధానాన్ని కొనసాగించడంలో అడ్డంకులు ఎదుర్కొంటున్నాయి. పాఠ్యాంశాలపై నియంత్రణ పెరగడం వల్ల ధార్మిక పరమైన బోధనకు ఆటంకం కలుగుతోంది.

## సిలబస్ మార్పులు- చరిత్ర వక్రీకరణ

2023లో NCERT పాఠ్యపుస్తకాల సవరణల పేరుతో మౌలికమైన చరిత్రను మార్చే చర్యలు చేపట్టబడ్డాయి. ముఖ్యంగా మొఘల్ చక్రవర్తుల పాలనపై ఉన్న అధ్యాయాలను తొలగించడం, గాంధీ హత్య నేపథ్యంలో హిందూ మహాసభ వంటి భావజాలాల ప్రస్తావనను తగ్గించడం లాంటి మార్పులు చరిత్రను ఏకపక్షంగా మార్చే ప్రయత్నమే. అలానే ఉర్దూ సాహిత్యం, ముస్లిం రచయితల కవిత్వం, ఇస్లామిక్ వాస్తు కళ, అల్లామా ఇక్బాల్ వంటి మేధావుల ప్రస్తావనలు తొలగించడం విద్యా విధానంలోని బహుళత్వానికి తీవ్రంగా భంగం కలిగించేది.

ఇవి దేశ సంస్కృతిలో ముస్లిం సముదాయాల ప్రత్యేకతను కనుమరుగు చేసే ప్రయత్నమే కాక, చరిత్రను తమకు అనుకూలమైన ఒక దృక్పథం వైపునకు మార్చే సంకల్పం అని స్పష్టంగా అర్థమవుతోంది. విద్యార్థుల్లో సమానత, పరస్పర గౌరవ భావన పెరిగే అవకాశాలు తగ్గిపోతున్నాయి. కేంద్రీకృత ధోరణితో రాష్ట్రాల స్థానికత, ప్రాంతీయ భాషల ప్రాధాన్యత తగ్గిపోవడం విద్యా వ్యవస్థల సాంస్కృతిక వైవిధ్యానికి విఘాతం కలిగిస్తున్నది.

## ముస్లిం మేధావులు మౌనం వీడాలి

ఇంత జరుగుతున్నప్పటికీ ముస్లిం మేధావులు నోరు విప్పకుండా మౌన వ్రతం పాటిస్తున్నారు. ఇది ఇలాగే కొనసాగితే విద్యావ్యవస్థ భ్రష్టు పట్టి తీవ్ర నష్టాలు ఎదుర్కొనక తప్పదు. మదర్సాలు, పాఠశాలలు, కళాశాలలు సమన్వయంతో ఐక్యంగా ప్రభుత్వం చేపడుతున్న అసంబద్ధ విధానాలపై గళం విప్పాల్సిన అవసరం ఉంది. రాష్ట్రస్థాయిలో, దేశ స్థాయిలో ముస్లిం విద్యా సంస్థలు తమ అభ్యంతరాలను, సమగ్రమైన తమ వాదనలను ప్రభుత్వాలకు విన్నవించి తగిన పరిష్కార మార్గాలను అన్వేషించాలి.

భారత రాజ్యాంగం ప్రసాదించిన హామీలను సద్వినియోగం చేసుకుంటూ చట్టబద్ధ పోరాటాలకు సన్నద్ధం కావాల్సిన అవసరం ఉంది. ఆర్టికల్ 30, 14, 15, 21ఏ వంటి రాజ్యాంగ సూత్రాల ఆధారంగా న్యాయస్థానాలనూ ఆశ్రయించాలి. మైనారిటీ కమిషన్, మానవ హక్కుల కమిషన్లకు నివేదికలు సమర్పిస్తూ, వ్యవస్థలు జవాబుదారీతనంతో పని చేసేలా ముస్లిం మేధావులు తమ పాత్ర నిర్వర్తించాలి.

విద్యను కాపాడాలన్న ఆలోచన మతాన్ని దాటి ప్రజాస్వామ్య స్థాయికి చేరాలి. విద్యార్థులు తమ హక్కులను గుర్తించి, పాఠ్యాంశాల్లో జరుగుతున్న అసమానతలపై ప్రశ్నించే స్థాయికి ఎదగాలి. విద్యార్థి సంఘాలు తమ స్వరం బలంగా వినిపించే విధంగా చురుకుగా స్పందించాలి. రచయితలు, పాత్రికేయులు విద్యా రంగంలో వివక్షపై విశ్లేషణాత్మక వ్యాసాలు, కథనాలు సమాజానికి అందించాలి. రాజకీయ నాయకులు అసెంబ్లీ, పార్లమెంట్ వేదికలపై 2020 విద్యా విధానంలోని అసమానతలపై స్పష్టంగా నిలదీయాలి. విద్యా హక్కులను కేవలం మైనారిటీల సమస్యగా కాకుండా, దేశ ప్రజాస్వామ్య స్ఫూర్తికి సంబంధించిన సమస్యగా ప్రస్తావించాలి.

ఇది మౌనంగా ఉండాల్సిన సమయం కాదు. మన చరిత్ర, విద్యా స్వాతంత్ర్యాన్ని కాపాడే బాధ్యత మైనారిటీలు సహా, అందరూ భుజానికెత్తుకోవాలి. ఇది భారత ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే ప్రతీ పౌరుడి బాధ్యత. విద్య ద్వారా సమానత్వాన్ని కల్పించాలన్న రాజ్యాంగ హామీకి భంగం కలిగిన ప్రతి చర్యకు వ్యతిరేకంగా ఒక బాధ్యతాయుతమైన స్పందన అవసరం.



# మన చదువులు, విలువలు ఏమైపోతున్నాయి?

- అర్షియా

## ◆ కన్నవారిని వృద్ధాశ్రమాల్లో వదిలేస్తున్న యువ దంపతులు

## ◆ చిన్న తప్పిదాలకే కన్న వారిని అంతం చేస్తున్న కఠినాత్ములు

**ఇటీవల** టీవీ ఆన్ చేస్తే అందులో ప్రసారమయ్యే వార్తలు తీవ్రంగా కలచివేసే విధంగా ఉంటున్నాయి. ప్రేమికులు తమను ప్రేమించినవారిని హత్య చేయడం, హిందువులు, ముస్లింల మధ్య మత ఘర్షణలు, ఒకరిపై మరొకరి దాడుల వార్తలే కనిపిస్తున్నాయి. ఇక వార్తా పత్రికలు తెరచి చూస్తే సంతోషించే వార్తలేవీ కనిపించవు! రాజకీయ అవినీతి, కుంభకోణాలు, విషాదకర సంఘటనలే ఎక్కువగా వాటిలో కనిపిస్తాయి. ఈ దుఃఖభరిత వార్తల పరంపరకు మనం అలవాటుపడి, భావావేశాలు కోల్పోతున్నాం.

ఇక మనుషుల సాధారణ సంభాషణల్లో, వాట్సాప్ చాటింగ్‌లలో కూడా మత ఘర్షణలు, సామాజిక అసహనం, రాజకీయ ఆరోపణల వాదనలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. దురదృష్టవశాత్తు ఇలాంటి విషయాలే మన దృష్టిని ఆకర్షిస్తుంటాయి. నిజంగా ముఖ్యమైన సమస్యలు మన దృష్టికి దూరమవుతున్నాయి.

ఇలా నిజంగా ప్రాధాన్యం కలిగిన రెండు సంఘటనల గురించి వివరించాలనుకుంటున్నాను. ఈ రెండు ఘటనలు మన సమాజం ఏ దిశగా సాగుతోందో చూపిస్తూ, మనం దృష్టి పెట్టాల్సిన విషయాల్ని తెలియజేస్తాయి.

1. బెంగళూరులోని దొడ్డ కల్లసంద్ర ప్రాంతానికి చెందిన 81 ఏళ్ల కృష్ణమూర్తి గారు, ఒక వృద్ధాశ్రమంలో నివసించేవారు. ఆయన ఇటీవల తన భార్య రాధతో కలిసి ఆత్మహత్య చేసుకున్నారు.

2. మహారాష్ట్రకు చెందిన ధోండిరాం భగవాన్ భోసలే అనే తండ్రి, NEET ప్రాక్టీస్ పరీక్షలో తక్కువ మార్కులు వచ్చినందుకు తన కూతురిని కొట్టి చంపాడు. ఆయన ఒక పాఠశాల ప్రిన్సిపాల్ కూడా.

ఆత్మహత్య చేసుకున్న కృష్ణమూర్తికి విజయ్ అనే కొడుకు ఒక్కడే సంతానం. విజయ్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. అతడికి పెళ్లై, పిల్లలు ఉన్నారు. అయితే అతని భార్యకు, అతడి తల్లిదండ్రులకు మధ్య తరచూ వాగ్వాదం జరిగేది. దీంతో ఐదు సంవత్సరాల క్రితం వృద్ధులైన తన అమ్మానాన్నలను అతడు అయిష్టంగానే వృద్ధాశ్రమానికి పంపించాల్సి వచ్చింది. కొంత కాలానికి వారిని మళ్లీ తన ఇంటికి తీసుకొచ్చాడు. పరిస్థితి మారిందేమో అని ఆశపడ్డాడు. కానీ వారికి కోడలితో మళ్లీ గొడవలు మొదలయ్యాయి. ఇంట్లో నిత్యం జరుగుతున్న ఈ గొడవల ఒత్తిడికి

తట్టుకోలేక విజయ్ తన కన్నవారిని మళ్లీ అదే వృద్ధాశ్రమానికి పంపించాడు. పోలీసుల కథనం ప్రకారం... విజయ్ వారి భద్రత కోసం నెలకు రూ.28 వేలు చెల్లించేందుకు ఒప్పుకొని ముందుగా కొంత మొత్తాన్ని అడ్వాన్స్‌గా ఇచ్చాడు.

పెద్దలను దేవునితో సమానంగా గౌరవించమని మన భారతీయ సంస్కృతి చెప్తుంది. ఖురాన్ ప్రకారం, ముస్లింలు తమ వృద్ధ తల్లిదండ్రుల పట్ల "ఉఫ్" అన్న పదాన్ని కూడా వాడకూడదు. మనం ఎన్ని నమాజ్‌లు, ఉపవాసాలు చేసినా... తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే, వారిని గౌరవించకపోతే మనకు మరణానంతరం స్వర్గప్రాప్తి దూరమవుతుంది. కానీ మన విలువలు, మానవత్వం, కుటుంబ బాధ్యతలనేవి క్రమంగా కనుమరుగవుతున్నాయి.

2022లో Help Age India స్వచ్ఛంద సంస్థ Bridge the Gap అనే నివేదికను విడుదల చేసింది. అది ఎన్నో ఆలోచనలను రేకెత్తించింది. ఇండియాలో 82శాతం వృద్ధులు తమ కుటుంబ సభ్యులతోనే కలిసి జీవిస్తున్నప్పటికీ, వారిలో 35 శాతం మంది తమ సొంత పిల్లల నుంచే హింసను ఎదుర్కొంటున్నారు. అదనంగా 21శాతం మంది కోడళ్ల ద్వారా, 2శాతం మంది వేతన ఉద్యోగుల ద్వారా వేధింపులకు గురవుతున్నారు. మిక్కిలి విచారకరమైన విషయం ఏంటంటే, ఈ వేధింపుల బారిన పడిన వృద్ధుల్లో 46శాతం మందికి ఆ విషయాన్ని ఎలా ఫిర్యాదు చేయాలో, ఎవరికి చేయాలో తెలియకపోవడం.

పరిస్థితి ఇంత దారుణంగా తయారవుతుంటే మరోవైపు దేశ వ్యాప్తంగా ధార్మిక కేంద్రాల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఎక్కువ మంది మందిరాలు, మసీదులను దర్శిస్తున్నారు. జై శ్రీరాం నినాదాలు చేయమని కొందరిని బలవంతం చేసిన వీడియోలు సోషల్ మీడియాలో కనిపిస్తున్నాయి. మతం కోసం చనిపోవడానికి సిద్ధంగా ఉన్న యువత తయారవుతున్నారు! కానీ ఈ మత ఉత్సాహం, ఉద్వేగాల మధ్య, మన వృద్ధుల పరిస్థితి ఎంత దీనంగా మారిందో.. చాలా మంది పట్టించుకోవడం లేదు.

వృద్ధులైన మన అమ్మానాన్నలు, బామ్మ, తాతయ్యలే మన జీవితంలో మొదట మనకు ధార్మిక, నైతిక విలువలు నేర్పినవారు. కానీ ఇప్పుడు చాలా మంది యువ దంపతులు వారిని వృద్ధాశ్రమాలలో వదిలేస్తున్నారు. కొందరిని వీధుల్లోకి నెట్టేస్తున్నారు. మరికొందరిని వేధిస్తున్నారు, దూషిస్తున్నారు, మౌనంగా బాధ పడేలా చేస్తున్నారు.

మరిక చెప్పడానికి మిగిలిందేముంది? ఓ తండ్రి.. అదీ ఓ పాఠశాల ప్రిన్సిపాల్, తన కూతురు తక్కువ మార్కులు సాధించిం దన్న కారణంతో ఆమెను చంపేశాడు. ఇలాంటి పరిస్థితుల్లో చదువులకు, విద్యకు అర్థం, పరమార్థం ఏముంది? ఒక వ్యక్తి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్న ఉన్నత విద్యావంతుడు, సంపాదనాపరుడు అయి ఉండి కూడా తన వృద్ధ తల్లిదండ్రులను వదిలేస్తే మానవత్వం, మనిషి బాధ్యతలు ఏమైనట్టు?

## వారితో సద్భావం.. స్వర్గానికి మార్గం

'తల్లిదండ్రులతో సద్భావంతో మెలగండి. బంధువులూ, అనాథలూ, నిరుపేదల పట్ల మంచిగా వ్యవహరించండి. ఇరుగు పొరుగు వారు, మిత్రులు, బాటసారులు, దాసీ జనంతో ఉదార బుద్ధితో వ్యవహరించండి' అని దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఉద్బోధించాడు. దీన్ని బట్టి మన అమ్మానాన్నలు, బంధువుల పట్ల మనం ప్రదర్శించాల్సిన గౌరవం, వారి పట్ల మనకున్న హక్కులు, బాధ్యతలు ఏమిటో తెలుస్తోంది. ఖుర్ఆన్ ప్రబోధన ప్రకారం మనల్ని చిన్నప్పుడు కంటికి రెప్పలా కాపాడిన మన తల్లిదండ్రులు ముసలి వారైపోయాక వారి పట్ల విసుక్కోకూడదు. వారు మనకు విసుగు తెప్పించినప్పటికీ 'ఉఫ్' అని కూడా అనకూడదు. తల్లిదండ్రులకు ఎన్ని సేవలు చేసినా వారి రుణాన్ని సంతానం తీర్చుకోలేదు. ఎందుకంటే బాల్యంలో నిస్సహాయులుగా ఉండే మన భౌతిక (శారీరక) ఎదుగుదలకు, మన వ్యక్తిత్వ వికాసానికి, సత్ప్రవర్తనకు వారే (ముఖ్యంగా తల్లి) కారణం. దైవప్రవక్త(స)ను ఓ వ్యక్తి, తన సత్ప్రవర్తనకు ఎక్కువ అర్హులు ఎవరని మూడుసార్లు అడిగినప్పుడు మూడుసార్లు కూడా తల్లి పేరు చెప్పడాన్ని బట్టి, నాల్గవ సారి తండ్రి పేరు చెప్పడాన్ని బట్టి మన జీవితంలో వారికివ్వాల్సిన ఉన్నత స్థానమేమిటో తెలుసుకోవచ్చు. ఇక బంధువులు మనతో అనుచితంగా ప్రవర్తించినా, మనతో తెగత్రెంపులు చేసుకున్నా వారి పట్ల 'సిలారహ్మీ' (బంధు ప్రేమ) కలిగి ఉండాలి. వారితో మంచిగా మెలగడం చాలా అవసరం. బంధువులతో తెగత్రెంపులు చేసుకొనేవాడు స్వరంలోకి ప్రవేశించడని స్పష్టం చేయటం జరిగింది. బంధువులను విడదీయడం లాంటి పాప కార్యాలకు పాల్పడకూడదని ఇస్లాం హెచ్చరిస్తున్నది. బంధువుల పట్ల మన హక్కుల్ని నెరవేర్చకపోతే దైవాగ్రహానికి కారణభూతులమవుతాం. దాన ధర్మాల విషయంలో నిరుపేద బంధువులకు మనం ప్రాధాన్యం ఇవ్వాలి. హదీసుల హిత వాక్యాల నేపథ్యంలో తల్లిదండ్రులు, బంధువుల పట్ల ప్రతి ముస్లిం గౌరవం కలిగి ఉండి, వారి పట్ల కలిగి ఉన్న హక్కులను, బాధ్యతలను నెరవేర్చాలి.

# ఊబకాయాన్ని తగ్గించుకునేదెలా?



డాక్టర్ ఎన్.ఖలీల్

**ప్రపంచవ్యాప్తంగా** ఆరోగ్య సమస్యలన్నిటిలో ప్రముఖంగా పరిగణించబడే సమస్య "ఊబకాయం" ప్రధానంగా మారుతోంది. ఇది కేవలం ఒక వ్యక్తిగత సమస్య కాదు. ఇది సమాజాన్ని, ఆరోగ్య వ్యవస్థను ప్రభావితం చేసే ప్రజారోగ్య సంక్షోభం.

భారతదేశంలో ఇది వేగంగా విస్తరిస్తున్నది. నిద్ర, ఆహారం, శారీరక శ్రమ, జీవనశైలి అన్నింటినీ కలిపిన సంక్లిష్ట సమస్య ఇది. అంతర్జాతీయ ఆరోగ్య సంస్థల నివేదికల ప్రకారం, ఇది ఒక "నిశ్శబ్ద మహమ్మారి"గా అభివర్ణించబడుతోంది.

### ప్రస్తుత గణాంకాలు- సూచికలు:

❖ భారతదేశంలో ఊబకాయులతో బాధపడుతున్న వారి సంఖ్య 25 కోట్లకు పైగా (2024 NCD రిపోర్టు ప్రకారం) ఉంది.

❖ పెరుగుతున్న వార్షిక వృద్ధి రేటు 4.2% (urban) & 2.8% (rural)

❖ పిల్లల ఊబకాయం 14.4 మిలియన్లు (WHO, 2023)

❖ ప్రపంచ స్థాయిలో భారతదేశం స్థానం 3వ స్థానం (ఊబకాయుల సంఖ్యలో)

❖ సగటు BMI పురుషులు 23.9 (ఇది గరిష్ఠ పరిమితికి సమీపం)

❖ సగటు BMI మహిళలు 24.5 (దరికొచ్చే ప్రమాదం వద్ద)

### ఊబకాయానికి కారణాలు :

**1. ఆహారపు అలవాట్లు**

❖ ప్రాసెస్డ్ ఫుడ్స్, జంక్ ఫుడ్స్, శీతల పానీయాలు అధికంగా తీసుకోవడం

❖ తరచూ భోజనం చేయడం (frequent snacking)

**2. శారీరక శ్రమలేమి**

❖ sedentary lifestyle : డెస్క్-జాబ్స్, ట్రావెల్-డిపెండెంట్ లైఫ్

❖ క్రీడలు, శారీరక కార్యాచరణలు తగ్గిపోవడం

**3. మానసిక ఒత్తిడి & నిద్రలేమి**

❖ మానసిక ఒత్తిడితో emotional eating పెరగడం

❖ నిద్ర తక్కువైతే హార్మోన్ల అసమతుల్యత, బరువు పెరగడం

**4. హార్మోనల్ & జన్యు కారణాలు**

కొన్ని ఆరోగ్య సమస్యలు (PCOD, hypothyroidism) కూడా కారకాలు కావచ్చు

వంశపారంపర్యంగా కూడా రావచ్చు

### ప్రభావిత రంగాలు, వర్గాలు:

**మహిళలు:**

◆ గర్భధారణ అనంతరం శరీరంలో మార్పులు

◆ గృహిణులలో శారీరక శ్రమ తగ్గిపోవడం

## ఉద్యోగులు

◆ రోజంతా కూర్చునే జీవనశైలి

◆ బిజీ షెడ్యూల్స్ వల్ల వ్యాయామానికి సమయం లేకపోవడం

## పిల్లలు:

◆ మొబైల్, టీవీ, వీడియో గేమ్స్ వల్ల physical activity తక్కువ

◆ స్కూల్ మెనూస్‌లో పోషకాహారం లేకపోవడం

## ఆరోగ్యపరమైన ప్రమాదాలు:

◆ హృదయ సంబంధిత వ్యాధులు (హార్ట్ ఎటాక్, స్ట్రోక్)

◆ టైప్ 2 డయాబెటిస్

◆ హై బ్లడ్ ప్రెషర్

◆ పాలిసిస్టిక్ ఒవరీ సిండ్రోమ్ (PCOS)

◆ నిద్రలేమి (Sleep apnea)

◆ ఆర్థరైటిస్

## పురుష, మహిళల ప్రధాన సమస్యలు

❖ క్యాన్సర్ రిస్క్ పెరుగుదల (బ్రెస్ట్, కలోన్ మొదలైనవి)

**ఆర్థిక ప్రభావం:**

❖ వ్యక్తిగతంగా మెడికల్ ఖర్చులు పెరగడం

❖ ఆరోగ్య బీమా పేమెంట్స్ పై ప్రభావం

❖ కంపెనీలు ఉత్పాదకత కోల్పోవడం (అనారోగ్య సెలవులు, లో ఎనర్జీ లెవల్స్)

❖ ప్రభుత్వ ఆరోగ్య వ్యయాల్లో భారంగా మారే అవకాశం

## పరిష్కార మార్గాలు:

**వ్యక్తిగత స్థాయిలో:**

1. ప్రతి రోజూ కనీసం 30 నిమిషాలు వ్యాయామం (నడక, ఈజీ వర్కౌట్స్)

2. ఆహార నియమాలు పాటించాలి- తక్కువ కొవ్వుతో, ఎక్కువ ఫైబర్‌తో కూడిన ఆహారం.

3. జాగ్రత్తగా మధ్యాహ్నం, రాత్రి భోజనం చేయాలి- మితంగా, సమయానుసారంగా.

4. నిద్ర సరిగా పొందాలి- రోజుకు 7-8 గంటలు

## వైద్య సలహా:

❖ డైట్ న్యూట్రిషనిస్ట్ మార్గదర్శనం తీసుకోవడం

❖ BMI మానిటరింగ్

❖ ఆరోగ్య పరీక్షలు (Lipids, Blood Sugar) నిరంతరంగా చేయించుకోవడం

## కుటుంబ స్థాయిలో:

◆ కుటుంబం మొత్తం కలిసి ఆరోగ్యకరమైన జీవనశైలి పాటించడం

◆ పిల్లల అలవాట్లు మెరుగుపరచడం- స్క్రీన్ టైమ్ తగ్గించడం

## ప్రభుత్వ / సామాజిక స్థాయిలో:

◆ ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం

◆ స్కూళ్ళలో ఆరోగ్యవంతమైన భోజనాలు అందించడం

◆ మునిసిపాలిటీలలో పార్కులు, వాకింగ్ ట్రాకులు అభివృద్ధి చేయడం

◆ బాడీ షేమింగ్ లాంటి దుష్ప్రచారాలను నిరోధించటం.

## ముగింపు

ఊబకాయం అనేది మన శరీరాన్ని కాదు. మనం ఎలా జీవిస్తున్నామో దానికి అద్దం వంటిది. జీవనశైలిలో మార్పులు, ఆహార నియమాలు, మరియు మానసిక ఆరోగ్యం పట్ల శ్రద్ధ పెట్టడం ద్వారా మనం ఈ సమస్యను తగ్గించవచ్చు. ఇది వ్యక్తిగత బాధ్యత మాత్రమే కాదు, కుటుంబం, సమాజం, ప్రభుత్వం సమిష్టిగా కలిసిరావాల్సిన సమయమిది.

''ఆరోగ్యమే మహాభాగ్యం'' అని నమ్మి, ఆరోగ్యవంతంగా జీవిద్దాం- ఊబకాయం నుండి విముక్తి పొందుదాం!

## పిల్లల ఊబకాయంపై ఆందోళన.. దృష్టి సారించాలంటున్న కేంద్రం

చిన్నపిల్లలకు తల్లిదండ్రులు ప్రేమగా అలవాటు చేసిన కొన్నిరకాల ఆహార పదార్థాలు వారికి చాలా ముప్పు కలిగించే ప్రమాదముందని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. నూనెలు, చక్కెరల వాడకాన్ని నియంత్రించాలని సూచించింది. కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సలహా సంఘం పిల్లలు-పౌష్టికాహారం అంశంపై మేలో ఓ అధ్యయనం చేసింది. ఈ నివేదికను జూలై 11న ఆ శాఖకు సమర్పించింది. సుమారు 6శాతం పిల్లలు స్థూలకాయంతో బాధపడుతున్నట్టు తెలిపింది. అధిక బరువు వల్ల రక్తపోటు, ఇతర గుండె జబ్బులు, మధుమేహంతోపాటు కొన్ని రకాల క్యాన్సర్ల బారినపడే ప్రమాదముందని వెల్లడించింది. ప్రస్తుత పరిస్థితిపై రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలు దృష్టి సారించాలని, పిల్లల ఆహార అలవాట్లపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించింది. ఐదేండ్లలోపు పిల్లల ఆహార అలవాట్లపై అంగన్‌వాడీ కేంద్రాలు దృష్టి సారించాలని పేర్కొంది. అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ తగ్గిపోవడం, జీవనవిధానమే స్థూలకాయానికి ప్రధాన కారణాలు అని తెలిపింది.

# వ్యాపారం ఇలా ఉండాలి...

**యం.ఏ ఆరీఫ్, భద్రాద్రి కొత్తగూడెం**

**ఒక** ఊరిలో ఒక ధాన్యం వ్యాపారి ఉండేవాడు.

ఒకరోజు వ్యాపారి దగ్గరికి అతడి గురువు వచ్చాడు. 'గురూజీ! నా వ్యాపారం వృద్ధి చెందాలని దీవించండి' అని అభ్యర్థించాడు వ్యాపారి.

దేవుడు నీ వ్యాపారంలో వృద్ధివికాసాలు ప్రసాదించుగాక. కానీ, నువ్వు ధాన్యాన్ని తూచేటప్పుడు నిజాయితీగా వ్యవహరించు' అని సూచించాడు గురువు. ఎప్పుడూ తూకంలో మోసం చేసే ఆ వ్యాపారి గురువుగారి ఉపదేశంతో తన వైఖరిని మార్చుకున్నాడు. న్యాయంగా తూచడం మొదలుపెట్టాడు. అనతి కాలంలోనే అతని వ్యాపారం వృద్ధి చెందింది. ధాన్యాన్ని తూచడానికి బంగారంతో తూనిక రాళ్లను చేయించాడు. దీంతో ఎక్కడెక్కడివారో వచ్చి ఆ తూనిక రాళ్లను చూసి ఆశ్చర్యపోతూ ఉండేవారు.

ఒకరోజు అతడు ఆ తూనిక రాళ్లను తీసుకొని తన గురువు దగ్గరికి వెళ్లాడు. గురువు గారూ! మీ ఆశీర్వాదంతో నా వ్యాపారం చాలా బాగుంది. బంగారు తూనిక రాళ్లతో ధాన్యాన్ని తూచేంత వృద్ధి సాధించాను అన్నాడు వ్యాపారి. ఆ బంగారపు తూనికరాళ్లను తీసుకెళ్లి ఏరులో పడవేయ్ అని గురువు ఆజ్ఞాపించాడు. గురువాజ్ఞ మేరకు బంగారం విలువ గురించి కూడా ఆలోచించకుండా వాటిని ఏటిలో పడవేసి ఇంటికి చేరుకున్నాడు.

ఈ సంఘటన జరిగిన మూడు రోజుల తర్వాత కొందరు రైతులు తమ ధాన్యాన్ని అమ్మడం కోసం పట్టణానికి వస్తున్నారు. రైతులు ఏరు దాటుతుండగా బంగారు తూకం రాళ్లు వారికి దొరికాయి. వాటిని చూడగానే.. ఇవి ఫలానా వ్యాపారివి అని గుర్తించారు. అతడి మంచితనం తెలిసిన రైతులు.. అలాంటి ఉత్తముడి సొమ్ము తీసుకోవడం భావ్యం కాదనుకున్నారు.

తూకం రాళ్లను తీసుకెళ్లి ఆ వ్యాపారికి ఇచ్చేశారు.

మళ్లీ తన దగ్గరికి చేరిన తూకం రాళ్లను గురువు దగ్గరికి తీసుకెళ్లాడు వ్యాపారి.

'నేను వీటిని ఏరులో పారేశాను. మళ్లీ నా దగ్గరికి వచ్చాయి గురువు గారూ' అని విన్నవించుకున్నాడు.

'నీవు ఎప్పుడైతే తూకంలో మోసం చేయడం మానేశావో, దైవం నీ సంపదలో వృద్ధిని ప్రసాదించాడు. నిజాయితీగా సంపాదించావు కనుకనే... నీ సొమ్ము మళ్లీ నీ దగ్గరికి చేరింద'న్నాడు గురువు.

అబద్ధమాడి సరుకు లోపాలను దాచినట్లైతే ఆ వ్యాపారంలో ఎలాంటి శుభం జరగదని, అసత్య ప్రమాణం చేయడం వల్ల సరుకు అమ్ముడుపోతుంది కానీ, వ్యాపారంలో శుభం తరిగిపోతుంది అని మహనీయ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అన్నారు.


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి గీటురాయి వారపత్రికను తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే డి.డి.ని 'Geeturai Weekly' పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

# మార్గదర్శనానికి మూలం దైవగ్రంథం

**ముహమ్మద్ వహీదుద్దీన్**

**మానవులు** తప్ప మిగిలిన జీవరాశులన్నీ తమకు స్వాభావికంగా ప్రసాదించబడిన మార్గదర్శనంతోపాటు ఉనికిలోకి వస్తాయి, పోషించబడతాయి, నశించిపోతాయి. జంతువులు, పక్షులు, క్రూరమృగాలు, జడ పదార్థాలు, వృక్షరాశుల పుట్టుకలో, అన్నపానీయాల విషయంలో, లైంగికవాంఛల పరిపూర్తి మొదలైన దశలన్నింటిలోనూ ఏ చట్టం లేదా ధర్మశాస్త్రం, ధర్మం ప్రకారం సమ్మతమయిన, నిషిద్ధమయిన విషయాలకు సంబంధించిన నియమ నిబంధనలు, సూత్రాల కొరకు దైవవాణి అవసరం లేదు. సర్వ సృష్టికర్త అయిన అల్లాహ్ వాటి ప్రకృతిలోనే వాటి జీవితానికి చెందిన దశలన్నింటి కొరకు మార్గదర్శకత్వాన్ని ఇమిడ్చి ఉంచాడు. కనుక అవి స్వాభావికంగానే పుట్టుకతోనే దైవం తరపున అవసరమయిన మార్గదర్శకత్వాన్ని పొంది ఉంటాయి. కనుక మానవుడు తప్ప జీవరాశులన్నీ ఏ దైవ గ్రంథానికీ లేదా దైవవాణికి లేదా ఏ దైవప్రవక్తకూ కట్టుబడి లేవు.

కానీ మానవుడిలో ఏ ఆత్మ అయితే ఊదబడిందో దాని సంతృప్తి, శాంతి కొరకు, అలాగే మానవుడు ప్రపంచంలో జీవించి ఉన్నంత వరకు అతడి జీవితానికి చెందిన ప్రతి దశలోనూ దేవుని తరపున మార్గదర్శకత్వం ఆవశ్యకత ఉంది. అందుకే మానవుడిని ఈ భూమి మీదికి పంపినప్పటి నుంచే తన తరపు నుంచి దివ్య వాణి (వహీ) ద్వారా మానవుడి జీవితంలోని ప్రతి దశ కొరకు తన ఆదేశాలను, విధి నిషేధాలను దేవుడు తన ప్రవక్తల ద్వారా పంపుతూ వచ్చాడు. ఆ పరంపరలో చివరిది ప్రస్తుతం మన వద్ద ఉన్న ఖుర్‌ఆన్ గ్రంథం.

సర్వ సృష్టికర్త అయిన, భాగస్వామిని ఎంతమాత్రం కలిగి ఉండని ఏకైక దైవమయిన అల్లాహ్‌ను సంపూర్ణంగా విశ్వసించడం, ఆయనచే పంపబడిన ఆఖరి ప్రవక్త అయిన హజ్రత్ ముహమ్మద్(స)ను విశ్వసించడం, ఆయనను నిజమైన రీతిలో అనుసరించడం, ఖుర్‌ఆన్ అందజేసిన మార్గదర్శకత్వం ప్రకారం మన జీవితం గడపడంలోనే శ్రేయస్సు, ఇహపరలోకాల సాఫల్యం ఇమిడి ఉన్నాయి.

# పనుల నిర్వహణ – చిట్కాలు




ప్రతి రోజు మనం అనేక పనులు చేస్తుంటాం. ఫోన్లలో మాట్లాడటం, సమావేశాలు, పై అధికారులతో చర్చలు, తోటి ఉద్యోగులతో మాటా మంతీ– ఇవన్నీ చాలాసార్లు పనికి సంబంధించినవే అయి ఉంటాయి. కొన్నిసార్లు విజయవంతంగా వీటిని అన్నింటినీ ముగించగలుగుతాం. మరికొన్నిసార్లు చెయ్యలేకపోవడం వల్ల ఎక్కువ పనులు ఒకేసారి మీదేసుకుంటాం. పనులు చెయ్యటానికి ఎంత సమయం అవసరమో మనం గ్రహించలేకపోవడం వల్ల ఇలా జరుగుతుంది. ఇలాంటి పనులను నియంత్రించుకోవటానికి కొన్ని చిట్కాలు పాటించవచ్చు.

1) ఈ పనిని నేనే చెయ్యాలా? దీనివల్ల లాభమేదైనా ఉందా? ఇది చెయ్యలేనని చెబితే ఏమవుతుంది? ఎవరో నన్ను చెయ్యమని అడిగినంత మాత్రాన ఈ పని ముఖ్యమైనది అయిపోతుందా? ఇలా ఆలోచించుకుని అవసరం లేని పనుల్ని తగ్గించుకోవచ్చు. ఈ పనిని మీరు చెయ్యవలసినదేననీ నిర్ణయించుకుంటే 2వ ప్రశ్నకు వెళ్ళండి.

2) ఇతరులకు సహాయం చేసేందుకు చాలా పనులు నెత్తిన వేసుకుంటాం. అందరి పనులకు ‘నో’ అని చెప్పలేక అంగీకరిస్తుంటాం. టైము ఉందా? పని ఎలా చెయ్యాలి? విఫలమైతే తరువాత చెయ్యలేను అని ఎలా చెప్పాలి? అందుచేత ముందు ‘నో’ చెప్పడం వల్ల ఒత్తిడి తగ్గినట్టే కదా!

ఈ పనిని ఎప్పుడు చేయాలి? అనే దానికి సమాధానంగా మూడు జవాబులున్నాయి : 1) ఈ రోజు చెయ్యడం 2) ఈ నెలలో ఏదో ఒక రోజు చెయ్యడం 3) ఈ ఏడాదిలో ఏదో ఒక నెలలో చెయ్యడం.

ఇలా నిర్ణయించుకుని దానిని కాలెండర్‌లో రాసుకుని, ఆ గడువు దాటక ముందే చేసేయ్యాలి.

చేస్తాను అని ఒప్పేసుకోవడం సులువుగా అనిపిస్తుంది. టైము లేకపోవడం మాత్రం తరచుగా సంభవిస్తుందని గుర్తుంచుకోవాలి. ఎప్పుడు చేయాలి? అనే ప్రశ్నకు జవాబు చెప్పలేకపోతే– ఏ పనినీ అంగీకరించవద్దు.




## 5 ఏళ్లు దాటాక పిల్లల ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి

బాల ఆధార్ తీసుకున్న పిల్లలు ఐదేళ్ల తర్వాత తప్పనిసరిగా వేలిముద్రలు, కనుపాపలు, ఫొటో అప్‌డేట్ చేయాలని, లేకపోతే వారి ఆధార్ డీ యాక్టివేట్ అవుతుందని భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ పేర్కొంది. ఐదేళ్ల లోపు పిల్లలకు బయోమెట్రిక్, ఐరిస్ అవసరం లేకుండా కేవలం ఫొటో మాత్రమే తీసుకొని యుఐడీఏఐ బాల ఆధార్ ఇస్తోంది. అటువంటి పిల్లలు ఏడేళ్లు దాటక మునుపే తప్పనిసరి వారి బయోమెట్రిక్, ఐరిస్, ఫొటోను వారి దగ్గరలోని ఆధార్ కేంద్రాలలో అప్‌డేట్ చేసుకోవాలని వారి ఆధార్‌లో నమోదై ఉన్న ఫోన్ నెంబర్‌కు యుఐడీఏఐ సందేశాలు పంపించింది. ఐదు నుంచి ఏడేళ్ల లోపు పిల్లలు ఆధార్ అప్‌డేట్ చేసుకుంటే ఉచితమని, ఏడేళ్లు దాటిన పిల్లలకు రూ.100 చెల్లించాలని తెలిపింది.

## ఇస్లామిక్ విద్యా బోధన తప్పేమీ కాదు

ఎంఐఎం పార్టీ గుర్తింపును రద్దు చేయాలన్న ఓ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ మేరకు ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. తిరుపతి నరసింహ మురారి అనే వ్యక్తి తరఫున దాఖలైన ఈ పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయ్‌మాల్యా బాగ్చిలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫున విష్ణుశంకర్‌జైన్ అనే న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఎంఐఎం పార్టీ ముస్లింలలో ఇస్లామిక్ విద్యను పెంపొందిస్తామని, షరియా చట్టం పట్ల అవగాహన పెంచుతామని చెబుతోందని అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ.. 'దీంట్లో తప్పేముంది? ఇస్లామిక్ విద్యను బోధించటం తప్పేమీ కాదు. మరిన్ని రాజకీయపార్టీలు ఇలా విద్యా సంస్థలను ఏర్పాటు చేస్తే మేం స్వాగతిస్తాం' అని వ్యాఖ్యానించింది.

## ఇక సమోసా, జిలేబీలకూ సిగరెట్ ప్యాకెట్ తరహా హెచ్చరికలు

అనారోగ్యకర ఆహారపు అలవాట్లపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. హానికారక కొవ్వులు అధికంగా ఉండే సమోసా, జిలేబీ, పకోడీ, వడాపావ్, చాయ్ బిస్కెట్ వంటి సాంప్రదాయిక ఆహారాలకూ సిగరెట్ ప్యాకెట్ తరహా హెచ్చరికలు జత చేసేందుకు నిర్ణయించింది. నాగ్‌పూర్ ఎయిమ్స్‌లో తొలుత ఈ ప్రాజెక్టును ప్రారంభిస్తారు. ఆ తరువాత దశల వారీగా ఇతర నగరాలు, సంస్థలకు విస్తరించనున్నారు. ఊబకాయం, డయాబెటిస్, హైబీపీ, గుండె జబ్బుల కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. బాగా వేయించిన ఆహార పదార్థాలు, చక్కెరలు ఎక్కువగా ఉండే ఫుడ్స్ ఈ పరిస్థితికి ప్రధాన కారణం. ది లాన్సెట్ జర్నల్‌లో ప్రచురితమైన ఓ అధ్యయనం ప్రకారం, 2050 నాటికి భారత్‌లో అధిక బరువు, ఊబకాయం వ్యాధిగ్రస్తుల సంఖ్య 440 మిలియన్‌లకు చేరుకుంటుంది. ఈ నేపథ్యంలో హానికారక ఆహారపు అలవాట్లపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు కేంద్రం నడుం కట్టింది.

## రేబిస్‌తో ఏటా 5,700 మరణాలు

రేబిస్‌తో మన దేశంలో నేటికీ ఏటా 5,700 మందికిపైగా మరణిస్తున్నారు. దేశవ్యాప్త అధ్యయనంలో ఈ విషయం వెల్లడైందని భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్)కి చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎపిడమాలజీ (ఎన్ఐఈ) తెలిపింది. 15 రాష్ట్రాల్లోని 60 జిల్లాల్లో ఈ సర్వే జరిగినట్లు వెల్లడించింది. ఏటా దాదాపు 91 లక్షల మందిని జంతువులు కరుస్తున్నాయని తెలిపింది. బాధితుల్లో 14 ఏళ్లలోపు బాలలు, 60 ఏళ్లు పైబడిన వృద్ధులు ఎక్కువగా ఉన్నారని పేర్కొంది. కుక్క కాటు బాధితుల్లో 80 శాతం మందికిపైగా కనీసం ఒకసారి అయినా రేబిస్ నిరోధక టీకాను వేయించుకున్నారని తెలిపింది.

## బిహార్‌లో 35.5 లక్షల ఓట్ల తొలగింపు

బిహార్‌లో ఎన్నికల కమిషన్ (ఈసీ) చేపట్టిన ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-ఎస్ఐఆర్) కారణంగా 35.5 లక్షల మంది పేర్లను తొలగించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఈసీ ఇచ్చిన గణాంకాల ఆధారంగా పార్టీలు ఈ అంచనాకు వస్తున్నాయి. ఇంతవరకు 6.6 కోట్ల మంది ఓటర్లు పేరు నమోదు పత్రాలను సమర్పించారని ఎన్నికల సంఘం పేర్కొంది. ఇది మొత్తం ఓటర్లలో 88.18 శాతానికి సమానమని తెలిపింది. ఫారాల సమర్పణకు ఈ నెల 25 వరకు సమయం ఉందని, ఆ తరువాత జాబితాలను ప్రచురిస్తామని వివరించింది. 12.5 లక్షల మంది అంటే 1.59 శాతం మంది ఓటర్లు చనిపోయారని, వారి పేర్లను జాబితాల నుంచి తొలగిస్తామని ఎన్నికల సంఘం తెలిపింది. మరో 17.5 లక్షల మంది అంటే 2.2 శాతం మంది బిహార్ నుంచి శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లారని, వారి పేర్లను కూడా తీసివేస్తామని పేర్కొంది. ఇంకో 5.5 లక్షల మంది అంటే 0.73 శాతం మంది పేర్లు రెండు చోట్ల ఉన్నాయని, వాటిని కూడా మార్చుతామని వివరించింది. ఈ లెక్కన 35.5 లక్షల మంది ఓటర్ల పేర్లు తొలగించే అవకాశం ఉంది.




## కాల్పులు విరమించండి


ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహుకు అంతర్జాతీయ సమాజం నుంచే కాదు.. స్వంత దేశంలో కూడా తీవ్ర వ్యతిరేకత ఎదురవుతున్నది. గాజాపై ఇజ్రాయిల్ సృష్టిస్తున్న మారణ హెూమానికి వ్యతిరేకంగా ఇజ్రాయిల్‌లోని టెల్అవీవ్‌లో ప్రజలు ఆందోళనలు చేశారు. ఇజ్రాయిల్ సైన్యం జరిపిన దాడుల కారణంగా గాజాలో మరణించిన చిన్నారుల కోసం వారు మౌన ప్రదర్శనను నిర్వహించారు. మరణాల సంఖ్య పెరుగుతున్నందున కాల్పులను విరమించాలని వారు డిమాండ్ చేశారు. ఇజ్రాయిల్ దాడులలో చనిపోయిన పిల్లల పట్ల నిరసనకారులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్లకార్డులను చేతబట్టుకొని నిరసనను తెలియ జేశారు. ఈ ఆందోళనల్లో మహిళలతో పాటు వందలాది మంది ప్రజలు పాల్గొన్నారు. కాల్పులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇజ్రాయిల్ యుద్ధోన్మాదానికి 57,762 మంది పాలస్తీనియన్లు మరణించారని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఇందులో సగం మందికి పైగా చిన్నారులు, మహిళలే ఉన్నట్టు వివరించింది. 2023, అక్టోబర్ నుంచి గాజాపై ఇజ్రాయిల్ తీవ్రంగా విరుచుకుపడుతున్నది. హమాస్ టార్గెట్‌గా చర్యలు తీసుకుంటున్నామని చెప్తూనే.. సామాన్య ప్రజలపై విరుచుకుప డుతున్నది. చిన్నారులు, మహిళలు, పౌరులు అనే తేడా లేకుండా కాల్పులు, డ్రోన్లతో యుద్ధోన్మాదాన్ని ప్రదర్శిస్తోంది. వీటికి సంబం ధించిన వీడియోలు సామాజిక మాధ్య మాల్లో వైరల్‌గా మారుతున్నాయి. ఇజ్రాయిల్ తీరును అంతర్జాతీయ సమాజం, పౌర సంఘాలు తీవ్రంగా విమర్శించాయి. అయినా.. ఇజ్రాయిల్ తీరు మారలేదు. అమెరికా మద్దతుతో ఒక్క గాజా మీదనే కాకుండా ఇతర దేశాలపై యుద్ధాలకు దిగుతున్నదని మేధావులు ఆందోళనను వ్యక్తం చేశారు. ఇజ్రాయిల్ జరుపుతోన్న యుద్ధానికి వ్యతిరేకంగా ఆ దేశంలో గతంలోనూ ఆందోళనలు జరిగాయి. యుద్ధానికి ముగింపు పలకాలంటూ మేలో వేలాది మంది ఆందోళనకారులు ఆ దేశ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యుద్ధాన్ని కొనసాగిస్తున్న ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు తీరు పట్ల వారు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ''ఇజ్రాయిల్‌కు నిజమైన శత్రువు హమాస్ కాదు.. ప్రజాస్వామ్య దేశాన్ని నాశనం చేస్తున్న ప్రధాని బెంజిమిన్ నెతన్యాహునే..'' అని ఆందోళనకారులు చెప్పారు. వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాల కోసం నెతన్యాహు ఈ యుద్ధాన్ని ఇంకా సాగిస్తున్నారని తెలిపారు. గాజాలో తమ ఆపరేషన్‌లను మరింత విస్తరిస్తామని ఇజ్రాయిల్ అధికారులు చెప్తున్నారు. ఈ చర్యలను మాత్రం బందీల కుటుంబీకులు, ఇజ్రాయిల్‌లోని పౌర సమాజం అంగీకరించటంలేదు. నెతన్యాహు తన చర్యలతో బందీలను బలిచేస్తున్నారని ఇజ్రాయిల్ ప్రజలు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

## గాజాపై 'ఆకలి' సంక్షోభం

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దళాలు అడ్డూ అదుపూ లేకుండా విరుచుకుపడుతున్నాయి. గాజాలో మారణహెూమాన్ని సాగిస్తున్నాయి. అక్కడ నివసిస్తున్న ప్రజలకు ఆహారం, ఇంధనం, నీరు, అత్యవసర మందులు లభించకుండా అడ్డుకుంటూ తీవ్రమైన ఆంక్షలు విధిస్తున్నాయి. దీంతో ఆ ప్రాంతంలో దారుణమైన ఆకలి సంక్షోభం తలెత్తింది. ఇజ్రాయిల్ దళాలు జరిపిన తాజా దాడిలో 78 మంది పాలస్తీనియన్ల ప్రాణాలు కోల్పోయారు. ఆహారం, తాగునీటి కోసం సహాయ కేంద్రాలకు వచ్చిన వారు సైతం మృత్యువాత పడుతున్నారు. దక్షిణ గాజాలోని రఫా నగరంలో ఆహార పంపిణీ కేంద్రం సమీపంలో సోమవారం ఇజ్రాయిల్ సైనికులు దాడి చేశారు. ఈ ఘటనలో కనీసం ఐదుగురు చనిపోయారని పాలస్తీనా అధికార వార్తా సంస్థ వఫా తెలిపింది. ఇజ్రాయిల్, అమెరికా మద్దతుతో వివాదాస్పద గాజా మానవతావాద ఫౌండేషన్ (జీహెచ్ఎఫ్) నడుపుతున్న సహాయ కేంద్రాలను లక్ష్యంగా చేసుకొని జరుగుతున్న దాడులలో ఇప్పటివరకూ 838 మంది చనిపోయారని చెప్పింది. దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్‌లో నిరాశ్రయులు ఆశ్రయం పొందుతున్న శిబిరంపై జరిగిన దాడిలో తొమ్మిది మంది మరణించగా పలువురు గాయపడ్డారు. సెంట్రల్ గాజాపై ఇజ్రాయిల్ జరిపిన వైమానిక దాడిలో బురైజ్ శరణార్థి శిబిరంలో ఉంటున్న తొమ్మిది మంది మృత్యువాత పడ్డారు. ఇదిలావుండగా సిరియాలోని సువేరాపై ఇజ్రాయిల్ తాజాగా దాడులు జరిపింది. ఇది డ్రూజ్ ప్రజలు ఎక్కువగా నివసించే నగరం. డ్రూజ్ ప్రజలకు వ్యతిరేకంగా సిరియా పాలకులు చేపడుతున్న చర్యలను నిరసిస్తూ అక్కడి సైనికులు, ఆయుధాలను లక్ష్యంగా చేసుకొని దాడి జరిపామని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూ, రక్షణ మంత్రి కట్జ్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే గోలాన్ హైట్స్‌ను ఆక్రమించుకున్న ఇజ్రాయిల్ ఇప్పుడు డ్రూజ్ ప్రజలను కాపాడే పేరుతో సువేరాపై దాడికి దిగిందని, తద్వారా తన ఆధిపత్యాన్ని విస్తరించుకోవాలని అనుకుంటోందని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. కాగా ఈ దాడులను ఖతార్ తీవ్రంగా ఖండించింది. ఇది బాధ్యతారాహిత్యమైన చర్య అని ఖతర్ విదేశాంగ ప్రతినిధి వ్యాఖ్యానించారు. సిరియా ప్రజల భద్రత ఇజ్రాయిల్ బాధ్యత కాదని చురక అంటించారు. ఇజ్రాయిల్, హమాస్ మధ్య దోహాలో కాల్పుల విరమణపై చర్చలు జరుగుతున్నాయని ఆయన చెప్పారు. అయితే ఆయన వివరాలేవీ వెల్లడించలేదు.

# నేర నిరోధానికి నైతిక, ఆధ్యాత్మిక శిక్షణ

## జమాఅతె ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో వివిధ మతాల నాయకులు, మేధావులతో సమావేశం



**సమాజం**లో పెరుగుతున్న నేరాలపై చర్చించేందుకు జమాఅతె ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో సర్వ మత గురువులతో కూడిన ఒక ఆన్‌లైన్ సమావేశాన్ని జులై 14న నిర్వహించారు. ఈ సమావేశానికి జమాఅతె ఇస్లామీ హింద్ ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ సలీమ్ ఇంజినీర్ అధ్యక్షత వహించారు.

ఈ సమావేశంలో వివిధ మతాలకు చెందిన ధార్మిక గురువులు – మేధావులు పాల్గొన్నారు. వీరిలో స్వామి సుశీల్ గోస్వామి మహారాజ్, స్వామి సర్వలోకానంద్, ఫాదర్ నార్బర్ట్ హెర్మన్, రబ్బీ ఎజెకియల్ మాలికర్, మర్జబాన్ నారిమన్ జైవాలా మరియు సిస్టర్ బీకే హుసైన్ తదితరులు ఉన్నారు. ప్రొఫెసర్ సలీమ్ ఇంజినీర్ అధ్యక్ష ప్రసంగంలో సమాజంలో పెరుగుతున్న నేరాల పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నేరాలను కేవలం కఠిన చట్టాలతోనే అరికట్టలేమని, సమాజంలో నేరాలపై చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు. మనిషి తన జీవిత లక్ష్యాన్ని గుర్తించక పోవడమే నేరాల పెరుగుదలకు ప్రధాన కారణమని ఆయన చెప్పారు. నేటి సమాజంలో బలవంతులు బలహీనులపై దుర్మార్గాలకు పాల్పడుతున్నారు. పిల్లలు, మహిళలపై నేరాలు పెరుగుతున్నాయి. భార్య భర్తను, భర్త భార్యను హత్య చేస్తున్నారు. వృద్ధులపై దారుణ నేరాలు జరుగుతున్నాయి. ఇలా తదితర నేరాలను ఆయన ఉదాహరణలతో వివరించారు. ప్రభుత్వ మద్దతుతో జరిగే నేరాలు అత్యంత ప్రమాదకరమైనవని ఆయన అన్నారు. ప్రభుత్వం నేరస్తులకు కొమ్ముకాయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. మీడియా నేర నిరోధానికి సహకరించే కంటెంట్ ప్రసారం చేయాలని, న్యాయవ్యవస్థ నేరస్తులకు త్వరితంగా శిక్ష విధించాలని ఆయన నేరనిరోధానికి పలు సూచనలు చేశారు. అంతర్జాతీయ స్థాయిలో ఉక్రెయిన్, పాలస్తీనా వంటి దేశాల్లో మానవత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న యుద్ధ నేరాలపై కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

స్వామి సుశీల్ గోస్వామి మహారాజ్ జమాఅత్ నిర్వహించిన ఈ సమావేశాన్ని అభినందించారు. సమాజంలోని ఒక్కో నేరం మొత్తం సమాజాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. మతపరమైన చర్చలతో పాటు నేరాలపై పార్లమెంటులో చర్చ అవసరమన్నారు. మతం పేరుతో జరిగే హింసను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించలేమన్నారు. మతపరమైన మేధావులందరూ కలసి ఒక వేదికపై దీనిని గురించి చర్చించాలన్నారు. స్వామి సర్వలోకానంద్ మాట్లాడుతూ, ఇది కేవలం భారత్‌కి మాత్రమే కాదు, ప్రపంచానికి సంబంధించిన సమస్యగా ఆయన అభివర్ణించారు. మనిషిలో మానవత్వం తగ్గిపోవడమే నేరాలకు మూలకారణమని అన్నారు. మానవ విలువలను పెంపొందించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. పిల్లలకు మంచి నైతిక విలువల బోధన అవసరమన్నారు. మంచి మనుషులు పెరిగితే నేరాలు వాటంతటవే తగ్గిపోతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మంచి నైతిక విలువలు కుటుంబం, పాఠశాల, కళాశాలల నుంచే మొదలవ్వాలని అన్నారు.

ఫాదర్ నార్బర్ట్ హెర్మన్ మాట్లాడుతూ.. మానవత్వం ప్రమాదంలో ఉందని, సమాజంలో అసమానతలు, అన్యాయాలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. మీడియా కూడా దీనికి బాధ్యత వహించాలన్నారు. మానవ విలువల వ్యాప్తి ద్వారా మాత్రమే నైతిక సంక్షోభాన్ని అరికట్టవచ్చున్నారు. రబ్బీ ఎజెకియల్ మాలికర్ మాట్లాడుతూ.. సమాజంలో ఆధ్యాత్మిక వెలుగును వ్యాపింపజేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. న్యాయవ్యవస్థ వేగంగా పని చేస్తే నేరాలు తగ్గుతాయని తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. మానవతా ధర్మాన్ని పెంపొందించాలన్నారు. మర్జబాన్ నారిమన్ జైవాలా మాట్లాడుతూ.. చిన్న వయస్సు నుంచే నేరాల హానిపై శిక్షణ ఇవ్వాలన్నారు. ఇంటి నుంచే ఇది ప్రారంభించాలన్నారు. సిస్టర్ బీకే హుసైన్ మాట్లాడుతూ.. సమాజం నైతికంగా దిగజారుతోందని, వ్యక్తిగత, స్వార్థం– ఇవన్నీ నేరాలకు దారితీస్తున్నాయన్నారు. మతం పేరుతో చీలికలను తొలగించాలన్నారు. మనం ఎవరో, మన బాధ్యతలేమిటో గుర్తించాలన్నారు. ప్రేమ, సోదరభావం వ్యాప్తి చేస్తే మార్పు ఖచ్చితంగా వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**